www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

సోమవారం 15 డిసెంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 96 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## చేతులు కలిపిన మైక్రోసాఫ్ట్, విప్రో

దేశీ ఐటీ దిగ్గజం విప్రో తాజాగా గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపింది. ఎంటర్‌ప్రైజ్‌లకు ఏఐ సొల్యూషన్లు అందించేందుకు వీలుగా వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరతీసింది. తద్వారా బెంగళూరులోని పార్ట్‌నర్ ల్యాబ్స్‌లో మైక్రోసాఫ్ట్ ఇన్నోవేషన్ కేంద్రం(హబ్)ను ఏర్పాటు చేయనుంది. మూడేళ్లపాటు అమల్లోఉండే సహకారం ద్వారా ఎంటర్‌ప్రైజెస్‌కు కీలక కార్యకాలపాలలో ఏఐ అమలుకు వీలు కల్పించనుంది. ఒప్పందం ద్వారా విప్రోకున్న కన్సల్టింగ్, ఇంజినీరింగ్ ఆధారిత సామర్థ్యాలకు మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ స్టాక్‌ను జత కలుపుకోనుంది. ఏఐ స్టాక్‌లో భాగంగా అజ్యూర్, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్, అజ్యూర్ ఏఐ ఫౌండ్రీ తదితరాలను భాగం చేసుకోనుంది.

## కేంద్రం,ఈసీపై రాహుల్ గాంధీ ఆగ్రహం


- 'ఈసీ బీజేపీ కుమ్మక్కయ్యి వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్నారు
- ఓట్ చోరీపై దేశ వ్యాప్తంగా 5.5కోట్ల మందికి పైగా సంతకాలు సేకరించాం
- ఓట్‌చోరీపై అందరూ ఏకమవ్వాలి
- ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు జోడించారు




## ఓట్ చోరీ ద్రోహులను గద్దె దింపాలి

- ఓట్ చోరీకి పాల్పడేవారు ద్రోహులు
- ఓటింగ్ హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే అలాంటి వారిని అధికారం నుంచి తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది
- కాంగ్రెస్ పార్టీ ఒక్కటే దేశాన్ని కాపాడగలదు
- సమష్టిగా కాంగ్రెస్ సిద్ధాంతాన్ని బలపరచాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉంది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే





## ఆస్ట్రేలియాలో ఉగ్రదాడి..

- షూటర్‌ను ఒంటిచేత్తో ఎదుర్కొన్న సామాన్యుడు...
- ఆస్ట్రేలియా బాండీ బీచ్‌లో ఉగ్రవాదుల కాల్పుల కలకలం
- 10 మంది మృతి, 29 మందికి తీవ్ర గాయాలు
- తుపాకీతో కాల్పులు జరుపుతున్న షూటర్‌ను అడ్డుకున్న సామాన్య పౌరుడు
- యూదుల పండుగను లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందని ప్రకటన



## కాంగ్రెస్ గుండాల్లారా తస్మాత్ జాగ్రత్త

- మా సహనాన్ని పరీక్షించవద్దు.. కేటీఆర్ వార్నింగ్
- కేసీఆర్ పదేళ్ల ప్రభుత్వంలో తుంగతుర్తిలో శాంతి వెల్లివిరిసింది
- అందరి సంతోషం కోసం కలిసి పనిచేశాం
- పేదల కడుపు నింపడం కోసం పనిచేశాం
- కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ ఎదురుచూస్తున్నారు
- పంచాయతీ ఎన్నికలకే ఇంతగా ఎందుకు భయపడుతున్నారు.

# రెండో విడతలోనూ కాంగ్రెస్ హవా

- వెయ్యికి పైగా స్థానాల్లో పాగా
- రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో సత్తాచాటుతున్న కాంగ్రెస్ మద్దతుదారులు
- కాంగ్రెస్ తర్వాత రెండోస్థానంలో కొనసాగుతున్న బీఆర్ఎస్ మద్దతుదారులు
- రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 85.86 శాతం పోలింగ్
- 3 గంటల నుంచి వెలువడుతున్న ఫలితాలు
- ఒక్కోక్కటిగా వెలువడుతున్న ఫలితాలు
- ఓటేసిన పలువురు ప్రజాప్రతినిధులు



హైదరాబాద్

తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 1362కు పైగా సర్పంచి స్థానాల్లో విజయాలను తమ ఖాతాలో వేసుకున్నారు. భారత రాష్ట్ర సమితి మద్దతు దారులు 652, బీజేపీ మద్దతుదారులు 171 స్థానాల్లో గెలుపొందారు. 385 స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 85.86 శాతం పోలింగ్ నమోదైంది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 3,911 సర్పంచ్, 29,917 వార్డు స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామ పంచాయతీల్లో ఓట్ల లెక్కింపును చెపట్టారు. దీంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల ఫలితాలు - మిగతా3లో

## ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తాం



- పాకిస్థాన్ ఉగ్రవాది నోటి దురుసు!
- లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు
- జమ్ముకశ్మీర్‌లో పోరాటం ముగియలేదు
- వివాదం మరింత తీవ్రమవుతుంది

## నీకు వెన్నుపోటు ఖాయం.. జాగ్రత్త కేసీఆర్

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- సోషల్ మీడియాను కేటీఆర్ మ్యానేజ్ చేస్తున్నారు..
- బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ ఉంటే కవిత ఎందుకు బయటకు వచ్చేది
- బీజేపీ తెలంగాణలో ఎప్పటికీ అధికారంలోకి రాదు.. వారు కలలు కంటున్నారు
- డీసీసీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం..
- మా ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారు..



ఢిల్లీ

మాజీ మంత్రి హరీశ్‌రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావుతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చాలా జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ఏ క్షణంలోనైనా హరీశ్‌రావు వెన్నుపోటు పొడుస్తారని.. ఈ విషయంలో కేసీఆర్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరికైనా సీఎం కావాలని ఉంటుంది కదా అని (హరీశ్‌రావును ఉద్దేశించి) విమర్శలు గుప్పించారు మహేశ్ - మిగతా3లో



## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

- బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ నియామకం
- నియామకాన్ని ఖరారు చేసిన బీజేపీ పార్లమెంటరీ బోర్డు
- ప్రస్తుతం బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నితిన్
- వెంటనే నియామకం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసిన పార్టీ
- జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో పార్టీలో మార్పులు
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవజ్ఞుడైన నేత

# రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర

- రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ చూస్తోంది
- కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- ఓట్ చోరీ, ఎస్ఐఆర్ ద్వారా అక్రమంగా గెలవాలని బీజేపీ చూస్తోంది
- దిల్లీలో 'ఓట్ చోర్- గద్దీ ఛోడ్' పేరుతో కాంగ్రెస్ పార్టీ మహా ర్యాలీ
- ధర్నాలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాహుల్ గాంధీ చేసే పోరాటంలో తెలంగాణ సిద్ధంగా ఉంది
- రామ్‌లీలా మైదానంలో సీఎం రేవంత్ రెడ్డి ఉద్వేగభరిత ప్రసంగం
- బీజేపీ, ఎన్నికల సంఘం (ఈసీ)పై తీవ్ర విమర్శలు
- దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పేదల ఓటు హక్కును లాగేసుకోవాలని ప్రయత్నం



హైదరాబాద్

రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ చూస్తోందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'ఓట్ చోర్-గద్దీ ఛోడ్' పేరుతో దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు. 'మహాత్మా గాంధీ, అంబేడ్కర్ రాజ్యాంగ రచన టైంలో రాజ్యాంగ సభలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ఓటు హక్కు విషయమై చర్చిస్తున్నప్పుడు ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్ గోల్వాల్కర్ తదితరులు వారికి ఓటు హక్కు ఇవ్వొద్దన్నారని తెలిపారు. కానీ గాంధీ, అంబేడ్కర్ వారికి ఓటు హక్కు కల్పించినందున ఈ దేశంలో ప్రభుత్వం ఏర్పాటులో వాళ్లు కూడా భాగస్వాములవుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్, గోల్వాల్కర్ భావజాలంతో ఉన్న నరేంద్ర మోదీ, అమిత్ షా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వారి - మిగతా3లో

# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో కీలక నియామకం జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బీహార్ మంత్రి నితిన్ నబీన్‌ను నియమిస్తూ బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పార్టీ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు ఈ నియామకానికి ఆమోదం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. “బీజేపీ పార్లమెంటరీ బోర్డు, బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నితిన్ నబీన్‌ను పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించింది” అని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం నితిన్ నబీన్ బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఆయనకు జాతీయ స్థాయిలో పార్టీ బాధ్యతలు అప్పగించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ఈ నియామకం ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.

ఇప్పటివరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా కేంద్రమంత్రి జేపీ నడ్డా కొనసాగిన సంగతి తెలిసిందే.

**ఎవరీ నితిన్ నబిన్?**



నితిన్ నబిన్ బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక అనుభవజ్ఞుడైన బీజేపీ నేత. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ఒక ముఖ్యమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు. పాట్నాలో జన్మించిన ఆయన, దివంగత బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నబిన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కుమారుడు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని నితిన్ నబిన్ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు.

నితిన్ నబిన్ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి తన సత్తా చాటారు. తన తండ్రి మరణం తర్వాత 2006లో పాట్నా వెస్ట్ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో తొలిసారిగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత బంకీపూర్ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు - 2010, 2015, 2020, 2025 ఎన్నికల్లో విజయదుందుభి మోగించారు. ముఖ్యంగా 2020 అసెంబ్లీ ఎన్నికల్లో, నటుడు, రాజకీయ నాయకుడైన శత్రుఘ్న సిన్హా కుమారుడు లవ్ సిన్హాపై భారీ మెజార్టీతో గెలిచి జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు.


ఇటీవల ముగిసిన 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఆయన తన సమీప ప్రత్యర్థిపై 51,000 ఓట్లకు పైగా భారీ ఆధిక్యంతో మరోసారి ఘన విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన నితీశ్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో బలమైన నేతగా, ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన వ్యక్తిగా నితిన్ నబిన్‌కు మంచి పేరుంది. ఇప్పుడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడు కావడంతో, ఆయన రాజకీయ ప్రస్థానంలో ఇది ఒక కీలక మలుపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆస్ట్రేలియాలో ఉగ్రదాడి..

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో దారుణమైన ఉగ్రదాడి చోటుచేసుకుంది. ప్రఖ్యాత బాండీ బీచ్‌లో ఉగ్రవాదులు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోగా, 29 మంది గాయపడ్డారు. ఈ భయానక ఘటనలో ఓ సామాన్య పౌరుడు చూపిన అసమాన ధైర్యం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రాణాలకు తెగించి, ఓ ఉగ్రవాదిపైకి దూసుకెళ్లి అతని చేతిలోని షాట్‌గన్‌ను లాక్కున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఫుట్‌పాత్‌పై నిలబడి ఓ దుండగుడు కాల్పులు జరుపుతుండగా, సమీపంలో కారు వెనుక నక్కిన ఓ వ్యక్తి ఒక్కసారిగా అతనిపైకి దూకాడు. ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో ఉగ్రవాది చేతిలోని గన్‌ను లాక్కుని, అతడిని కిందపడేశాడు. ఆ గన్‌ను దుండగుడికి ఎక్కుపెట్టడంతో అతను వెనక్కి తగ్గాడు. అనంతరం ఆ వ్యక్తి తుపాకీని ఓ చెట్టుకు ఆనించి, తాను దుండగుడ్ని కాదు అని పోలీసులు గుర్తించేలా శాంతియుతంగా చేతులు పైకెత్తాడు. ఆదివారం సాయంత్రం యూదుల ‘హనుక్కా’ పండుగ వేడుకలు జరుగుతున్న ప్రదేశంలో ఈ దాడి జరిగింది. దీనిని ఉగ్రవాద చర్యగా అధికారులు ప్రకటించారు. ఈ దాడిని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తీవ్రంగా ఖండించారు. “యూదుల పండుగ రోజున వారిని లక్ష్యంగా చేసుకుని చేసిన క్రూరమైన దాడి ఇది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ఇతరులను కాపాడిన సామాన్యులు నిజమైన హీరోలు. వారి ధైర్యం ఎన్నో ప్రాణాలను నిలబెట్టింది” అని ఆయన అన్నారు. ఈ దాడిలో ఇద్దరు దుండగులు పాల్గొన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వారిలో ఒకరిని కాల్చి చంపగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడో వ్యక్తి ప్రమేయంపైనా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై న్యూ సౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మిన్స్ స్పందిస్తూ, “ఈ విషాదంలో కూడా అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించే సామాన్యులు మన మధ్య ఉన్నారనడానికి ఇదే నిదర్శనం” అని పేర్కొన్నారు.

**ఆస్ట్రేలియాలో ఉగ్రదాడి.. భారత్‌లో ‘హై అలర్ట్’**

భారత్‌లోని పలు ప్రధాన నగరాల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు



జారీ చేశాయి. దేశంలో యూదుల్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద సంస్థలు దాడులు చేయొచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఢిల్లీ, బెంగళూరు, ముంబై నగరాల్లో హై-అలర్ట్ జారీ చేశారు. ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం.. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 (స్థానిక కాలమానం ప్రకారం) గంటలకు కాల్పులు చోటు చేసుకొన్నాయి. ఈ కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో ఇవాళ్టి నుంచి ప్రారంభమైన యూదుల పండుగ హనుక్కా సందర్భంగా ఉగ్రవాదులు పెద్ద దాడులు చేయాలని యోచిస్తున్నట్లు భారత్‌లోని ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. యూదుల ప్రార్థనా మందిరాలు, కమ్యూనిటీ సెంటర్లు, ఇజ్రాయెల్‌కు సంబంధించిన సంస్థల్ని ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

**హనుక్కా పండుగ ఎప్పుడు?**

యూదులు ఘనంగా జరుపుకునే ఎనిమిది రోజుల పండుగ హనుక్కా. ఈ పండుగ డిసెంబర్ 14 నుండి ప్రారంభమైంది. ఈ పండుగ సమయంలో యూదులు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు, వేడుకలు నిర్వహిస్తారు. అందువల్లే పండుగ పర్వదినాన భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

**ఏ నగరాలు ప్రధాన టార్గెట్?**

ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం యూదు సంస్థలు, ప్రార్థనా మందిరాలు, కమ్యూనిటీ సెంటర్ల వద్ద భద్రత పెంచారు. విదేశీ పర్యాటకులు, ముఖ్యంగా ఇజ్రాయెల్ పౌరుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్రం, రాష్ట్రాలు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

**ఆస్ట్రేలియా బీచ్ లో కాల్పుల ఘటనను తీవ్రంగా ఖండించిన ప్రధాని మోదీ**

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో గల ప్రఖ్యాత బాండీ బీచ్‌లో ఘోర ఉగ్రదాడి జరిగింది. యూదుల పండుగ అయిన ‘హనుక్కా’ తొలిరోజు వేడుకలు జరుపుకుంటున్న వారిపై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం జరిగిన ఈ ఘటనలో ఒక ఉగ్రవాదితో సహా 12 మంది మృతి చెందగా, ఇద్దరు పోలీసులతో కలిపి 29 మంది గాయపడ్డారు. ఈ దాడిని భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను న్యూ సౌత్ వేల్స్ పోలీసులు ఉగ్రవాద చర్యగా ప్రకటించారు. దాడికి పాల్పడిన వారిలో ఒకరిని సిడ్నీకి చెందిన నవీద్ అక్రమ్‌గా గుర్తించినట్లు ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఏబీసీ) న్యూస్ తెలిపింది. ప్రస్తుతం ఇద్దరు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నారు. ఆ ప్రాంతంలో ఇంకా పోలీస్ ఆపరేషన్ కొనసాగుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ దాడిపై ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “ఆస్ట్రేలియాలోని బాండి బీచ్ వద్ద, యూదుల పండుగ అయిన హనుక్కా తొలిరోజు వేడుకలు జరుపుకుంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని ఈరోజు జరిగిన ఘోర ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. భారత ప్రజల తరపున, ఈ దాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ విషాద సమయంలో ఆస్ట్రేలియా ప్రజలకు మేం అండగా ఉంటాం. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని భారతదేశం, అన్ని రూపాల్లోని ఉగ్రవాదంపై జరిగే పోరాటానికి సంపూర్ణంగా మద్దతు ఇస్తుంది” అని ట్వీట్ చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ దీనిని విధ్వంసకర ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఇది జాతి విద్వేషంతో యూదు సమాజంపై చేసిన దాడి అని, ప్రతి ఆస్ట్రేలియన్‌పై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. దేశంలో ఇలాంటి ద్వేషానికి, హింసకు తావులేదని, బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# తరలిపోనున్న ‘తీహార్’.. ఎక్కడకి? ఎందుకు?

తీహార్ జైలు.. దీనిని అధికారికంగా తీహార్ కారాగార ప్రాంగణం అని పిలుస్తారు. ఇది దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద కారాగారంగా ప్రసిద్ధి చెందింది. ఢిల్లీలోని ఈ జైలు.. ఖైదీల సంస్కరణ నిలయంగానూ ప్రసిద్ధి చెందింది. ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ హయాంలో దీనికి ‘తీహార్ ఆశ్రమం’ అనే పేరు కూడా వచ్చింది. ఇక్కడ కరుడుగట్టిన నేరస్తులు మొదలుకొని, పేరుపొందిన రాజకీయ నేతలు, పారిశ్రామికవేత్తల వరకు పలువురు నేరస్తులు శిక్షలు అనుభవిస్తుంటారు. ఖైదీలకు వృత్తి విద్య, ఆధ్యాత్మిక శిక్షణ, యోగా, తీహార్ బ్రాండ్ కింద వివిధ ఉత్పత్తులను తయారుచేసే అవకాశాలు కల్పిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన తీహార్ జైలు త్వరలో తరలిపోతున్నదనే వార్త చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తాజాగా నగరంలోని తీహార్ జైలును ఢిల్లీ శివార్లకు తరలించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు తెలిపారు.

**తీహార్ గ్రామంలో..**

తీహార్ జైలు అనేది కేవలం ఒకే భవనం కాదు. పలు కేంద్ర జైళ్లతో కూడిన ఒక అతిపెద్ద సముదాయం. అధికారికంగా దీనిని ‘తీహార్ జైళ్లు’ అని పిలుస్తారు. ఇది పశ్చిమ న్యూఢిల్లీలోని తీహార్ గ్రామంలో 1958లో నెలకొల్పారు. తొలుత ఈ కేంద్ర జైలు 1,273 మంది ఖైదీలను ఉంచే సామర్థ్యంతో ప్రారంభమైంది. జైలు పరిపాలనా నియంత్రణ మొదట్లో పంజాబ్ ప్రభుత్వం ఆధీనంలో ఉండేది. ఆ తర్వాత 1966లో ఢిల్లీ పరిపాలనకు జైలు బదిలీ అయ్యింది. తీహార్ జైలు ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద జైలుగా పేరొందడంతో పాటు ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే జైలు వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది.

**సామర్థ్యానికి మించి..**

కాలక్రమేణా తీహార్ జైలు సముదాయం భారీగా విస్తరించింది




ప్రస్తుతం ఇందులో 10 వేర్వేరు కేంద్ర జైళ్లు (%జజీ%-1 నుండి %జజీ%-10 వరకు) ఉన్నాయి. ఈ జైలు అధికారికంగా దాదాపు 10,000 మంది ఖైదీలను ఉంచే సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, దీనిలో సామర్థ్యానికి మించి 15,000 నుండి 19,000 మంది ఖైదీలు ఉంటుంటారు. ఈ అధిక రద్దీ తీహార్ జైలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. ఈ సముదాయం శిక్ష పడిన ఖైదీలు, విచారణలో ఉన్న ఖైదీలు మహిళా ఖైదీల కోసం ప్రత్యేక విభాగాలు ఉన్నాయి.

**కిరణ్ బేడీ సంస్కరణలతో..**

1990లలో కిరణ్ బేడీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (జైళ్లు)గా పనిచేసిన సమయంలో తీహార్ జైలు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆమె నాయకత్వంలో జైలులో పలు మానవతా సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటిలో ఖైదీల కోసం ధ్యానం, యోగా, వృత్తిపరమైన శిక్షణ, విద్యా కార్యక్రమాలు ప్రధానమైనవి. ఈ సంస్కరణలు జైలు వాతావరణాన్ని మెరుగుపరచడంలో, ఖైదీలలో సానుకూల మార్పులు తీసుకురావడంలో సహాయపడ్డాయి. ఈ సంక్షేమ కార్యక్రమాల కారణంగా తీహార్ జైలు కేవలం ఖైదీలను నిర్బంధించే స్థలంగానే కాకుండా, సంస్కరణల కేంద్రంగా కూడా పేరు పొందింది.

**హింస, గ్యాంగ్ వార్ ఘటనలతో..**

తీహార్ జైలును తరలించడానికి ఇక్కడ పెరుగుతున్న ఖైదీల సంఖ్య, భద్రతా సమస్యలు ప్రధాన కారణాలుగా నిలిచాయి. సుమారు 10 వేల మంది ఖైదీలను ఉంచే సామర్థ్యం ఉన్న జైలులో ప్రస్తుతం 19 వేల మందికి పైగా ఖైదీలు ఉండటంతో భద్రత, నిర్వహణ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే ఈ జైలు నివాస ప్రాంతాలకు దగ్గరగా (తిలక్‌నగర్, హరినగర్ వంటి జనావాసాలకు సమీపంలో) ఉండటం వల్ల, చుట్టుపక్కల ప్రజల భద్రత, రక్షణ కోసం దీనిని నరేలా వంటి నగర శివారు ప్రాంతాలకు తరలించాలని ఢిల్లీ ప్రభుత్వం యోచిస్తున్నది. ఇటీవల జైలులో ఖైదీల మధ్య హింస, గ్యాంగ్ వార్ లాంటి సంఘటనలు పెరగడం కూడా ఈ యోచనకు ఒక కారణంగా కనిపిస్తోంది.

## మరోసారి నోరు జారిన మంత్రి.. లబ్ధిపొందే మహిళలు సీఎం సభలకు రావాలని డిమాండ్



**భోపాల్:** ఒక మంత్రి మరోసారి నోరుజారారు. ప్రభుత్వ పథకం లబ్ధిపొందే మహిళలు సీఎం బహిరంగ సభలకు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే వారు పొందే లబ్ధిని ఆపేస్తామని హెచ్చరించారు. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్ర మంత్రి, రత్లాం జిల్లా ఇన్‌చార్జ్ విజయ్ షా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రత్లాంలో జరిగిన జిల్లా అభివృద్ధి సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో లాడ్లీ బెహ్నా లబ్ధిదారుల సంఖ్య గురించి మహిళా, శిశు అభివృద్ధి శాఖ అధికారులను మంత్రి విజయ్ షా అడిగారు. రత్లాం జిల్లాలో సుమారు 2.5 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని అధికారులు ఆయనకు చెప్పారు. కాగా, మంత్రి విజయ్ షా దీనిపై స్పందించారు. ముఖ్యమంత్రి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున 2.5 లక్షల మంది లబ్ధిదారుల్లో కనీసం 50,000 మంది మహిళలు గౌరవం చూపించడానికి ముందుకు రావాలని అన్నారు. ‘ప్రభుత్వం నెలకు రూ. 1,500 చొప్పున కోట్ల రూపాయలు ఇస్తోంది. కాబట్టి కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి ధన్యవాదాలు చెప్పడం తప్పనిసరి. మేం ఆహారాన్ని ఏర్పాటు చేస్తాం. సభలకు రాని మహిళలకు ఏమి జరుగుతుందో చూద్దాం’ అని హెచ్చరించారు. ‘ఎవరికైనా ఆధార్ లింక్ చేయకపోతే, వారి దరఖాస్తు నిలిచిపోతుంది. అంటే అది స్వయంచాలకంగా ఆగిపోతుంది. అప్పుడు అందరూ వస్తారు’ అని ఆయన అన్నారు. దీంతో సమావేశంలో పాల్గొన్న అధికారులు ఇది విని షాక్ అయ్యారు. ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా మంత్రి విజయ్ షా వ్యాఖ్యలపై మండిపడింది.

## కేంద్రం,ఈసీపై రాహుల్ గాంధీ ఆగ్రహం

**ఢిల్లీ:** ప్రతిపక్షాలకు మద్దతు ఇచ్చే ఓటర్లను ఓటర్ల జాబితానుంచి తొలగిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఆదివారం ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఓట్ చోర్, గద్దీ ఛోడ్ ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ‘ఈసీ బీజేపీ కుమ్మక్కయ్యి వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఓట్ చోరీపై దేశ వ్యాప్తంగా 5.5కోట్ల మందికి పైగా సంతకాలు సేకరించాం. ఓట్‌చోరీపై అందరూ ఏకమవ్వాలి. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు జోడించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత,నిష్పక్షపాతం ఉండాలి. కానీ ఇక్కడ అలా లేదు. అందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాటం చేస్తున్నాం. ఈ పోరాటానికి మీ అందరి మద్దతు కావాలి’అని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు.

## ‘ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తాం’

పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తామని అన్నాడు. ఢిల్లీని ఆక్రమిస్తాం అనే అర్థం వచ్చేలా ఈ వ్యాఖ్య చేశాడు. అదేవిధంగా భారత వైమానిక దళంపై కూడా ఆ ఉగ్రవాది నోరుపారేసుకున్నాడు. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు. పాకిస్థాన్ ఆర్మీ అతడిని గతంలో సాధారణ పౌరుడిగా, అమాయకుడిగా పేర్కొన్నది. అయితే ఇప్పుడు భారత్‌పై దాడులకు బహిరంగంగా పిలుపునిస్తూ చేసిన వ్యాఖ్యల్లో అతడిలోని ఉగ్ర భావజాలం స్పష్టమవుతున్నది. తాజాగా అతడు మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో పోరాటం సమసిపోయిందనే వాదనలను కొట్టిపారేశాడు. జమ్ముకశ్మీర్‌లో పోరాటం ముగియలేదని, వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించాడు. ఎల్ఇటీ సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మక్కీని ఉద్దేశిస్తూ.. భారత రాజధానిని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు. ఈ సందర్భంగా ఢిల్లీని ఆక్రమిస్తామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశాడు. భారత సైనిక శక్తిపై కూడా రవూఫ్ నోరుపారేసుకున్నాడు. భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధవిమానాలు, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్‌లు అసమర్థమైనవిగా వ్యాఖ్యానించాడు. భారత వైమానిక దళం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించే ధైర్యం చేయదని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించాడు. ఇస్లామిక్ దేశాల్లో పాకిస్థాన్ వద్ద మాత్రమే అసలైన అణ్వాయుధాలు ఉన్నాయన్నాడు.

## యూపీ బీజేపీ అధ్యక్షుడిగా.. కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి

**లక్నో:** కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేష్ పాఠక్ సమక్షంలో ఈ మేరకు ఆదివారం వెల్లడించారు. పంకజ్ చౌదరికి ఎన్నికల ధృవీకరణ పత్రాన్ని పియూష్ గోయల్ అందజేశారు. కాగా, కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి శనివారం ఈ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. పోటీలో ఉన్న ఏకైక అభ్యర్థి ఆయనే కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఉత్తరప్రదేశ్ బీజేపీ చీఫ్ భూపేంద్ర చౌదరి తన వారసుడికి పార్టీ జెండాను అందజేశారు. మరోవైపు బీజేపీ కొత్తగా ఎన్నుకున్న 120 మంది జాతీయ కౌన్సిల్ సభ్యుల పేర్లను కూడా కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ప్రకటించారు. వీరిలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు. వారణాసికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తుండగా, సీఎం యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లక్నో నుంచి, కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రయాగ్‌రాజ్ నుంచి, బ్రజేష్ పాఠక్ ఉన్నావ్ నుంచి బీజేపీ జాతీయ కౌన్సిల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## ఓట్ చోరీ ద్రోహులను గద్దె దింపాలి



**న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. ఓట్ చోరీకి పాల్పడేవారు ద్రోహులని, ఓటింగ్ హక్కులను, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే అలాంటి వారిని అధికారం నుంచి తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆదివారంనాడు నిర్వహించిన ‘ఓట్ చోర్ గద్దీ ఛోడ్’ మెగా ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఒక్కటే దేశాన్ని కాపాడగలదని చెప్పారు. సమష్టిగా కాంగ్రెస్ సిద్ధాంతాన్ని బలపరచాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉందని అన్నారు. దేశాన్ని తుదముట్టించడమే ఆర్ఎస్ఎస్ ఐడియాలజీ అని ఖర్గే విమర్శించారు. బెంగళూరులో తన కుమారునికి ఆపరేషన్ జరుగుతున్నప్పటికీ తాను వెళ్లలేదని, ర్యాలీకి హాజరయ్యేందుకు ఇక్కడే ఉండిపోయానని చెప్పారు. 140 కోట్ల ప్రజలను కాపాడటమే తన ప్రాధాన్యతగా భావించినట్టు తెలిపారు. బీజేపీ నేతలు కేవలం డ్రామాలు చేస్తుంటారని, కొందరయితే పార్లమెంటు సమావేశాలప్పుడు, అయిన తర్వాత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్తుంటారంటూ ప్రశ్నిస్తుంటారని, అయితే పార్లమెంటు సమావేశం జరుగుతున్నప్పుడు మోదీ పార్లమెంటు సెషన్లలో పాల్గొనలేదని, విదేశాలకు వెళ్లారని చెప్పారు. ‘ఓట్ చోరీ తర్వాత వారు అధికారంలో కూర్చున్నాను. ఈ ద్రోహులను అధికారం నుంచి తొలగించాల్సి ఉంది’ అని ఖర్గే తన ప్రసంగంలో పేర్కొన్నారు

# రెబల్ విజేతలపై కాంగ్రెస్ నేతల కన్ను..!!

**కోదాడ :** ఎవరు గెలిస్తే మనకేంటి.. మన దొడ్లో దూరితే చాలు.. అన్న చందగా ఉంది అధికార కాంగ్రెస్ నియోజకవర్గ నేతల పరిస్థితి. సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్ నగర్, తుంగతుర్తి నియోజకవర్గాలలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక ఆ పార్టీ నేతలకు పెద్ద తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు. తొలినుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నవారు.. అధికారం వచ్చిన తర్వాత పార్టీలో ఇబ్బడి ముబ్బడిగా చేరిన నాయకుల మధ్య సర్పంచ్ ఎన్నికలు వివాదానికి తెరతీశాయి. అయితే బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం ఈ ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడటం విశేషం.

తాము బలంగా ఉన్నచోట కాంగ్రెస్ రెబల్ శ్రేణులతో పోటీ చేస్తూ వారు బలంగా ఉన్నచోట బీఆర్ఎస్ మద్దతిస్తుండటం స్పష్టంగా కనిపిస్తుంది.. . కాగా ఈ మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మాత్రం అధికారికంగా గుర్తులు లేకపోవడంతో తాము మద్దతిచ్చిన అభ్యర్థులు ఓడినప్పటికీ గెలిచిన వారు కూడా తమ వారేనని కాంగ్రెస్ కండువాలు కప్పేందుకు సన్నాహాలు చేస్తుండటం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేస్తుంది. మెజారిటీ గ్రామ పంచాయతీల అభ్యర్థుల ఎంపికలు అధికార పార్టీ అధికార అభ్యర్థులుగా ప్రకటించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంలో పార్టీ పరువు దక్కించుకునేందుకు గెలిచిన అభ్యర్థులను తమ పార్టీ ఖాతాలో వేసుకునేందుకు నియోజకవర్గ ముఖ్య నాయకులకు పురమాయించినట్లు తెలుస్తుంది.

గత ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు నానా కష్టాలు పడ్డామని తమ గ్రామాలలో మెజారిటీ వచ్చేందుకు సొంత డబ్బులు ఖర్చు పెట్టామని, అయినప్పటికీ అధికార అభ్యర్థులుగా తమను ప్రకటించలేదని ఈ పరిణామంలో ఆయా గ్రామాలలోని రెబల్ అభ్యర్థులు బీఆర్ఎస్ ఇతరుల




మద్దతుతో లక్షలు ఖర్చు పెట్టి ఎన్నికల బరిలో నిలిచి గెలిచామని ఇప్పుడు పార్టీ కండువా కప్పుకోమంటే ఓట్లు వేసిన ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నిబంధనలను పాటించాల్సిన కోదాడ చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులే విస్మరించి ఒకరు అధికార అభ్యర్థికి వ్యతిరేకంగా రెబెల్ అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలిపితే మరొకరు ఏకంగా తన గ్రామంలో పార్టీ అభ్యర్థిని నిలపకుండా టీడీపీ అభ్యర్థిని గెలిపించడం పట్ల నిబద్ధత గల కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కష్ట కాలంలో జెండా మోసిన వారిని కాదని ఇటీవల పార్టీలోకి వచ్చిన మోతుబరులకు మద్దతు ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. తమ గ్రామాలలో పార్టీ పక్షాన నియోజకవర్గ స్థాయి నాయకులు కనీస ప్రచారానికి నోచుకుపోవడం సమంజసమేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడప్పుడే తాము పార్టీ కండువా కప్పుకోలేమని మాట దాటవేస్తున్నట్టు తెలుస్తోంది

# పట్టు నిలిచేనా..?


జిల్లాలో రాజకీయం విభిన్నం.. ఇక్కడ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం ఉంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తింపుపై జరిగేవి కాకపోయినప్పటికీ ఈ నేతలకు తాము బలపర్చిన అభ్యర్థుల గెలుపు ప్రతిష్టాత్మకం. ఫలితాలు తారుమారైతే తమ పట్టు జారిందనే విమర్శలతో పాటు పార్టీ పరిస్థితిపై మరో రకంగా కార్యకర్తల్లో చర్చ సాగుతుందనే అభిప్రాయం స్థానిక ఎమ్మెల్యేల్లో కనిపిస్తోంది. అందుకే పార్టీ పరంగా ఈ ఎన్నికలు జరగకపోయినా వారు మా త్రం తాము బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో ప్రభావం చూపెట్టడం ద్వారా మిగతా రెండు విడతల్లోనూ గట్టి ఫలితాలు సాధించాలని ఆయా పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

**మూడు నియోజకవర్గాలు.. ఆరు మండలాలు**

మొదటి విడత పంచాయతీ ఎన్నికలు నేడు ఆరు మండలాల్లో జరగనున్నాయి. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ, సిరికొం డ, ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నార్నూర్, గాదిగూడ మండలాల్లో పోరు సాగుతుంది. ఇవన్నీ ఎస్టీ రిజర్వుడ్ పంచాయతీలే. బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఖా నాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరికి ఈ విడత కీలకం కానుంది.

**బోథ్‌లో..**

బోథ్ నియోజకవర్గంలో ఈ ఎన్నికలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మొదటి విడతలో ఈ నియోజకవర్గంలోని రెండు మండలాల్లో జరుగుతున్నాయి. ఇక్కడ మంచి ఫలితాలు సాధిస్తే మలి విడతలో జరిగే మిగతా మండలాల్లో పట్టు సాధించవచ్చనేది ఆయన ప్రయత్నం. రెండు మండలాల్లో 52 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతుండగా, 12 జీపీలు ఏకగ్రీవాలయ్యా యి. ఇందులో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు సమఉజ్జీ లుగా ఉండగా, బీజేపీ తాము ఉన్నామంటే ఉన్నామనే విధంగా ఇప్పటివరకు పరిస్థితి ఉంది. ఇక ఎ న్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయనేది




ఆసక్తికరం.

**ఖానాపూర్‌లో..**

ఖానాపూర్ నియోజకవర్గంలో ఎన్నికలు కాంగ్రెస్ ఎమ్మెలే వెడ్మ బొజ్జుకు అత్యంత కీలకంగా మారింది. ఇటీవలే ఆయన పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా కూడా నియామకం అయ్యారు. ఈ క్రమంలో సొంత నియోజకవర్గంలో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గె లుపు ఆయనకు ప్రతిష్టాత్మకంగా మారింది. తొలి వి డత ఎన్నికలు జరిగే రెండు మండలాల్లో 11 చోట్ల ఏకగ్రీవాలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులతో పాటు ఏ పార్టీకి సంబంధం లేని వారు ఎక్కువ మంది ఉన్నారు. ఇక్కడ కూడా బీజేపీ ఉన్నామంటే ఉన్నామనే విధంగా ఏకగ్రీవంలో కనిపించింది. బీఆర్ఎస్‌కు ఇక్కడ ఏకగ్రీవాల్లో చో టు లభించలేదు. దీంతో ప్రత్యక్ష ఎన్నికల్లో ఫలి తాలు ఎలా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది.

**ఆసిఫాబాద్‌లో..**

ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో తనకున్న గట్టి పట్టును ఎట్టి పరిస్థితుల్లో కోల్పోకుండా ఆమె ముందుకు కదులుతున్నారు. ఈ నియోజ కవర్గంలోని రెండు మండలాల్లో తొలివిడత ఎన్నికలు జరుగుతుండగా, ఇక్కడ 10 ఏకగ్రీవాలకు గాను ఏకపక్షంగా బీఆర్ఎస్ ముందుంది. కాంగ్రెస్ ఉనికి చాటుకునేంత పరిస్థితి మాత్రమే ఉంది. ఇక ఎన్ని కల ఫలితాలపై అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ఇండిపెండెట్లపై ప్రధాన పార్టీల దృష్టి

**ఆదిలాబాద్:** మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరిగిన చోట మేజర్ పంచాయతీల్లో ఫలితాలు ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలకు ప్రతికూలంగా రావడం చర్చనీయాంశంగా మారింది. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి పంచాయతీల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఇక్కడ స్వతంత్రులు విజేతలుగా గెలిచారు. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి గెలుపొందారు.

**'హస్తం'కు గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్**

మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది. నువ్వా.. నేనా అన్నట్టుగా ఫలితాలు నిలిచాయి. ఈ రెండు పార్టీల తర్వాత స్వతంత్రులు అధిక సంఖ్యలో గెలుపొందడం గమనార్హం. ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లోనే స్వతంత్రులు ఎక్కువగా గెలిచారు. వారు ఎటువైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది.

**రెండో విడత ఏకగ్రీవాలు ఇలా..**

రెండో విడత ఎన్నికలు ఆదిలాబాద్ నియోజకవర్గంలోని 6, బోథ్ నియోజకవర్గంలోని రెండు మండలాల్లో జరగనున్నాయి. ఇక్కడ 17 జీపీల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇందులో కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి ఒకరు ఆయా పార్టీలు బలపర్చిన అభ్యర్థులు ఉండగా, ఏడుగురు స్వతంత్రులు ఉండటం గమనార్హం. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఆదిలాబాద్‌రూరల్, బేల నుంచి ఏకగ్రీవమైన సర్పంచులు వారు ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారనే విషయంలో ఇప్పుడే నిర్ణయం వెలువర్చడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా అటువైపే మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతుంది. నియోజకవర్గాల్లో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేల పరపతితో ఆయా



పార్టీల వైపు మొగ్గుచూపుతారా.. లేదా అనేది కూడా చూడాల్సిందే. మొత్తంగా మొదటి విడత పంచాయతీ ఎన్నికలు పూర్తి కాగా, రెండో విడత పంచాయతీ ఎన్నికలపై అందరి దృష్టి నెలకొంది.

## రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర

-మొదటిపేజీ తరువాయి

భావజాలాన్ని అమలు చేసేందుకు 400 సీట్లు కావాలని కోరుకున్నారని, బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ చెప్పడంతోనే దేశ ప్రజలు ఆ పార్టీని 240 సీట్లకు పరిమితం చేశారని పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీ చేసే పోరాటంలో తెలంగాణ సిద్ధంగా ఉంది**

అలా చేయబట్టే ఇవాళ రాజ్యాంగం రిజర్వేషన్లు ఉన్నాయని, అందుకే ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. నాడు పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీల కోసం గాంధీ, అంబేద్కర్ నిలబడినట్లే, ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలుస్తున్నారని కొనియాడారు. మనం వారికి అండగా నిలవాలని కోరారు. ఎస్ఐఆర్ పేరుతో తొలుత ఓటరు కార్డు తొలగిస్తారని, తర్వాత ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ రద్దు చేస్తారని ఆరోపించారు. ఆ తర్వాత మనకు ఉన్న హక్కులన్నీ గుంజుకుంటారని తెలిపారు. ఈ సమస్య ఎన్నికలదో, కాంగ్రెస్ పార్టీదో కాదని, దేశ సమస్య అని, ఈ సమస్యకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రకటించారు. దేశ ప్రజలంతా కలిసి రావాలని కోరుతున్నానని తెలిపారు.

"ఎస్ఐఆర్, ఓట్ల చోరీ పేరుతో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, పేదల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ రోజు గాంధీజీ, అంబేద్కర్ వారి కోసం నిలబడ్డారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే ఈ జాతి ప్రజల కోసం నిలబడి మోదీ , అమిత్‌షాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు . ఆ ఆర్ఎస్ఎస్, ఆ గోల్వాల్కర్ భావజాలన్ని ఓడించేందుకు రామ్‌లీలా మైదానంలో మనం ఇక్కడికి ఒకటిగా చేరాం. అక్కా, తమ్ముళ్లారా ఇది పోటీ కాదు. ఇది కాంగ్రెస్ సమస్య కాదు. ఈ సమస్య దేశానిది. దేశంలో పేదలది, దళితులది, ఆదివాసీ, మైనార్టీలది. ఈ సమస్య కోసం రాహుల్ మోదీకి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అందుకే రాహుల్‌కు మరింత బలాన్ని ఇచ్చి ఆయనకు అండగా నిలబడాలి. ఈ యుద్ధంలో రాహుల్‌గాంధీని దేశం గెలిపించాలి. లేకుంటే పేదల ఓటు హక్కును లాక్కుంటారు. ఆ తర్వాత ఆధార్‌కార్డ్ తొలగిస్తారు. రేషన్‌కార్డు తీసేస్తారు. భూములు, ఆస్తులను లాక్కుంటారు. ఆదివాసీలు సర్వం కోల్పోతారు. అందుకే మనమందరూ ఒక్కటై రాహుల్‌గారికి మద్దతుగా సైన్యంగా మారి మోదీకి వ్యతిరేకంగా పోరాడాలి. తెలంగాణ తరఫున మేము ఇక్కడికి వచ్చాము. మీరు మాతో పోరాడేందుకు సిద్ధమా?" – రేవంత్ రెడ్డి, తెలంగాణ సీఎం

## రెండో విడతలోనూ కాంగ్రెస్ హవా

-మొదటిపేజీ తరువాయి

వెలువడుతున్నాయి. రెండో విడతలో 4,332 సర్పంచ్ స్థానాలకుగానూ 415, వార్డుల్లో 38,322కి గాను 8,304 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారుల మధ్య స్వల్ప వాగ్వాదం తలెత్తింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. హనుమకొండ జిల్లా ఐనవోలులో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి స్వగ్రామం చెర్లపాలెంలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి మహేందర్? విజయం సాధించారు.

నాయకుల మధ్య వాగ్వాదం

పరకాల ఎంపీడీవోపై హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ కోసం ఉపయోగించే పెట్టెలకు గుర్తింపు స్టిక్కర్లు అంటించడంలో ఆలస్యం చేయడంపై ఆమెను నిలదీశారు. పరకాల మండలం నాగారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని చల్లబర్చారు.

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తన స్వగ్రామం ఝురాసంఘంలో తోటి గ్రామస్థులతో కలిసి లైన్‌లో నిలబడి ఓటు వేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్‌లో బీఆర్?ఎస్? జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తన స్వగ్రామం కొరివిపల్లి ఓటు వేశారు.

ఓటేసిన పలువురు ప్రజాప్రతినిధులు

చేగుంట మండలం రుక్మాపూర్‌లో ప్రశాంత్‌రెడ్డి అనే వ్యక్తి సింగపూర్ నుంచి వచ్చి ఓటేశారు. సిద్దిపేట జిల్లా పోతారంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బొప్పాపూర్‌లో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు దంపతులు ఓటు వేశారు. భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రెండో విడత పల్లెపోరు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తమ గ్రామ పరిపాలకులను ఎన్నుకునేందుకు ఉత్సాహంగా ఓటేశారు.

## నీకు వెన్నుపోటు ఖాయం..
## జాగ్రత్త కేసీఆర్..



-మొదటిపేజీ తరువాయి

కుమార్ గౌడ్. ఢిల్లీలో మహేశ్ కుమార్ గౌడ్ ఆదివారం పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ ఉంటే కవిత ఎందుకు బయటకు వచ్చేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ మంత్రి కేటీఆర్‌కి డబ్బులుండటంతోనే సోషల్ మీడియాను మ్యానేజ్ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ తెలంగాణలో ఎప్పటికీ అధికారంలోకి రాదని.. వారు కళలు కంటున్నారని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్.

డీసీసీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం..

'తెలంగాణ రాష్ట్ర కేబినెట్ ప్రక్షాళన కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయమే ఫైనల్. డీసీసీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్ర కేబినెట్‌లోకి నేను వెళ్లే ప్రసక్తే లేదని.. కేవలం ప్రచారం మాత్రమే చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్ష పదవితో చాలా సంతోషంగా ఉన్నాను. రాష్ట్ర మంత్రికి లేని ప్రాధాన్యం టీపీసీసీ అధ్యక్షుడికి ఉంది. మా ప్రభుత్వ ఏర్పాటుకు ముందు కేసీ వేణుగోపాల్ నన్ను మంత్రి పదవి తీసుకుంటావా అని అడిగారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి గురించి సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్‌తో ఎవరూ పోటీ పడలేని విధంగా అభివృద్ధి చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ డెవలప్‌మెంట్‌పై ఓ విజన్ ఉంది. తెలంగాణలో మా ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదు' అని వ్యాఖ్యానించారు మహేశ్ కుమార్ గౌడ్.

మా ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారు..

'మా ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌తో గ్రామాల్లోని ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఒక నెలలోపు పెండింగులో ఉన్న పదవులు అన్నీ భర్తీ చేస్తాం. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉంది. పార్టీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువగా సర్పంచ్‌లను కాంగ్రెస్ గెలిచింది. ఇతర రాష్ట్రాల కన్నా హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం ఉంది. అనేక మంది హైదరాబాద్‌లో సెటిల్ అవుతున్నారు. ఫోర్త్ సీటు ఏర్పాటుతో నగరంలో అభివృద్ధి జరుగుతోంది. భాగ్యనగర అభివృద్ధిని ఎవరు ఆపలేరు. హైదరాబాద్ ఇండియాలో బెస్ట్ సిటీ అవుతుంది. వచ్చే ఏ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ సునాయాసంగా గెలుస్తుంది. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది' అని ధీమా వ్యక్తం చేశారు మహేశ్ కుమార్ గౌడ్.

## సంపాదకీయం

# ట్రంప్ 'శాంతి'కి గ్రహణం

ఎనిమిది యుద్ధాలను ఆపానని స్వోత్కర్షకు పోతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరువు తీసేలా ప్రపంచంలో రెండుచోట్ల మళ్లీ కుంపట్లు రాజుకున్నాయి. సుంకాలు విధిస్తానంటూ బెదిరించి రెండునెలల క్రితం ఆయన ఆగ్నేయాసియా దేశాలైన థాయ్‌లాండ్ %–% కంబోడియాల మధ్య సాగుతున్న యుద్ధాన్ని ఆపి సఖ్యత కుదిర్చారు. ఆ రెండింటి మధ్యా సరిహద్దు సమస్యకు శాంతియుత పరిష్కారం కుదిరిందని ఆర్భాటంగా ప్రకటించారు. తీరా అయిదురోజుల నాడు కంబోడియా మందుపాతరకు తమ సైనికుడు తీవ్రంగా గాయపడటంతో థాయ్ వైమానిక దళం దాడులు ప్రారంభించింది. ఈసారి దాదాపు పదిమంది మరణించగా వేలాదిమంది జనం ప్రాణభయంతో గ్రామాలు విడిచి పెట్టి వెళ్లిపోవాల్సి వచ్చింది. కంబోడియా సైన్యం ప్రతీకార దాడులతో థాయ్ గ్రామాల ప్రజలు కూడా ఖాళీ చేయాల్సి వచ్చింది. మొత్తానికి అటూ, ఇటూ 5 లక్షలమంది నిరాశ్ర యులయ్యారు. ఆఫ్రికాలో పరస్పరం తలపడుతున్న కాంగో%–%రువాండాల మధ్య కేవలం వారం క్రితం ట్రంప్ శాంతి ఒప్పందం కుదిర్చారు. కానీ అది కూడా విఫలమైంది. పర్యవ సానంగా కాంగోలోని సరిహద్దు గ్రామాలను 2 లక్షల మంది ఖాళీ చేయాల్సి వచ్చింది. రువాండా తిరుగుబాటు సంస్థ ఆ గ్రామాల్లోకి ప్రవేశించిందం టున్నారు. సమస్య మూలమేమిటో తెలుసుకోకుండా, ఇరుపక్షాలూ ఎలాంటి పరిష్కారాన్ని కోరుకుంటున్నాయో గ్రహించకుండా, అందుకు ఏర్పడుతున్న అడ్డంకులేమిటో అర్థం చేసుకోకుండా... ఒక ఫోన్ కాల్‌తో, ఒకటి రెండు బెదిరింపులతో అంతా సమసిపోతుంద నుకుంటే అవి మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. ట్రంప్ దౌత్యం విఫలం కావటానికి కారణం ఇదే. ఇరుగు పొరుగు దేశాల మధ్య భూభాగం గురించే ప్రధానంగా ఘర్షణలుంటాయి. థాయ్‌లాండ్%–%కంబోడియాల సమస్య కూడా అదే! రెండు దేశాలకూ 817 కిలోమీటర్ల పొడవునా సరిహద్దు ఉంది. ఫ్రాన్స్ దురాక్రమణలో కంబోడియా ఉండగానే వందేళ్ల క్రితం థాయ్‌లాండ్‌తో పేచీ ఏర్పడింది. 1953లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దాన్ని పరిష్కరించుకుందామని కంబోడియా ప్రయత్నిస్తోంది. కానీ రెండువైపులా పుట్టు కొచ్చే జాతీయవాద ధోరణులు అందుకు అడ్డంకిగా మారాయి. 2008లో వివాదాస్పద భూభాగంలోని 11వ శతాబ్దం నాటి హిందూ దేవాలయాన్ని యునెస్కో ప్రపంచ వార సత్వ సంపదల జాబితాలో చేర్చినప్పుడు అది తమదేనని కంబోడియా ప్రకటించు కోవటంతో ఘర్షణలు తలెత్తాయి. వాస్తవానికి 1962లోనే ఆ భూభాగం కంబోడియా దేనని అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించింది. కానీ అందుకు థాయ్ లాండ్ ససేమిరా అంటున్నది. మొన్న జూలైలో ఇరువైపులా 50 మంది మరణానికి దారితీసిన ఘర్షణలు రాజు కున్నప్పుడు అప్పటి థాయ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా, కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌తో జరిపిన ఫోన్ సంభాషణలు లీక్ అయ్యి ఆమె పదవి పోగొట్టు కున్నారు. తమ సైన్యం కూడా సరిగా వ్యవహరించటం లేదని ఆమె అంగీకరించటం దేశంలో పెద్ద దుమారం లేపింది. నాలుగు దశాబ్దాలు దేశాన్నేలిన హున్ సేన్ ఇప్పటికీ ప్రస్తుత ప్రధాని, తన కుమారుడు హున్ మానెట్‌ను తెర వెనక ఉండి నడిపిస్తుంటారు. ఆయనతో మాట్లా డితే తప్ప సమస్య పరిష్కారం కాదని షినవత్రా అనుకోవటం కొంప ముంచింది. తాజా వివాదం పర్యవసానంగా కంబోడియా పౌరులను దేశంలోకి రానీయ కుండా థాయ్‌లాండ్ సరిహద్దుల వద్ద అడ్డుకుంటుండగా, థాయ్ సినిమాల ప్రసారం, అక్కడి పండ్లు, కూరగాయలు, గ్యాస్, ఇంధనం రాకుండా కంబోడియా నిలిపేసింది. థాయ్%–%కంబోడియా ఘర్షణలైనా, కాంగో%–%రువాండాల కొట్లాట అయినా ప్రత్యర్థి దేశాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించినప్పుడే పరిష్కారమవుతాయి. దాదాపు అన్ని దేశాల్లోనూ అధికారం కోసం జాతీయవాద ధోరణులు రెచ్చగొట్టడం వల్ల సమస్య లొచ్చిపడుతున్నాయి. థాయ్‌లాండ్‌లో వచ్చే ఫిబ్రవరి 6న ఎన్నికలు జరగబోతున్నాయి. గతంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, దేశాన్ని రక్షించేది తామేనని చెప్పటానికి కంబో డియాపై యుద్ధభేరి మోగించటంతో పాటు పాలకపక్షం శుక్రవారం పార్లమెంటును రద్దు చేసింది. మళ్లీ ఇరుపక్షాల మధ్యా రాజీ కుదురుస్తానని ట్రంప్ చెబుతున్నా ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

# రాజీ ఎరుగని విప్లవ యోధుడు

భారత దేశంలో ప్రముఖ కమ్యూ నిస్టు నేతల్లో మాకినేని బసవ పున్నయ్య ఒకరు. విద్యార్థి సంఘం నేతగా ప్రారంభమైన ఆయన రాజ కీయ ప్రస్థానంలో తొలుత కాంగ్రెస్ లోనే ఓనమాలు దిద్దుకున్నారు. అనంతరం కమ్యూనిస్టు భావాలు ఆకర్షించడంతో సీపీఐలో చేరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అనంతరం సీపీఎం ఆవిర్భా వంలో కీలక పాత్ర పోషించారు. ఆ క్రమంలో ఆయన అంతర్జాతీయ స్థాయి కమ్యూనిస్టు నేతలైన స్టాలిన్, మాలటోవ్, సుస్లోవ్, మాలెంకోవ్‌లతో చర్చలు జరిపారు. అలాగే చైనా కమ్యూనిస్టు దిగ్గజాలు మావోసేటుంగ్, చౌఎన్‌లై తోనూ పున్నయ్య సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. 1952 నుంచి 1966 వరకు రాజ్యసభ సభ్యునిగా పని చేశారు. కార్ల్‌మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి, జీవితాంతం రాజీ ఎరగని పోరాట యోధునిగా నిలిచి పోయారు. కామ్రేడ్ బసవ పున్నయ్య రేపల్లె మండం తూర్పుపాలెం లోని భూస్వామ్య కుటుంబంలో 1914 డిసెంబరు 14న జన్మించారు. తల్లి దండ్రులు చారుమతి, అప్పయ్య. భార్య జగదాంబ. ప్రారంభంలో సాంప్రదాయ విద్య, అనంతరం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివి, బందరు నోబుల్ కళాశాలలో ఇంటర్మీ డియట్, గుంటూరు ఎ.సి. కాలే జీలో బి.ఎ.పూర్తి చేశారు. 1930లో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన నాటి తరం నేతలతో కలిసి పనిచేసి అనుభవాలను పంచుకున్నారు. ఆనాడు కాంగ్రెస్ నాయకత్వం ఉద్యమాన్ని తాత్కాలికంగా రద్దు చేయటంతో అసంతృప్తి చెంది బసవ పున్నయ్య ప్రజల సమస్యలు సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే పరిష్కారం కాగవన్న విశ్వాసంతో 1934 –35లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. గుంటూరులో జరిగిన విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించి, సహ విద్యార్థుల్కెన వై.వి.కృష్ణారావు, మాద నారాయణ స్వామి, మోటూరు హనుమంత రావు, లావు బాగంగాధర రావుతో కసి రాష్ట్రంలో బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి, 1938లో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, అదే సమ యంలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ సహాయ కార్యదర్శిగా పని చేశారు. 1940లో గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా బాధ్యతను స్వీకరించారు. 1943లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుగా ఎన్నికై నారు. 1948లో కలకత్తాలో జరిగిన సి.పి.ఐ. ద్వితీయ మహాసభలో కేంద్ర కమిటికి ఎన్నికయ్యారు. 1964లో పార్టీ చీలిన తరువాత సి.పి.ఐ.(ఎం) పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆ స్థానంలో నాలుగు దశాబ్దాల పాటు తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగారు. మార్క్సిజం లెనినిజంకు చివరి వరకు కట్టుబడి ఉండి పీడిత ప్రజ విముక్తి కోసం విశిష్టమైన సేవందించారు. నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట విశ్లేషణను చేయగలిగిన మార్క్సిజం లెనినిజం అనే సజీవ సిద్ధాంత వ్యాప్తికి, భారతదేశ ప్రజ విముక్తికి గణనీయమైన సేవలం దించారు. తెలంగాణ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులో కామ్రేడ్ మాకినేని ఒకరు. తెంగాణా



సాయుధ పోరాటంలో కామ్రేడ్స్ సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు మొదల్కెన ప్రముఖులతో పాటు కీలక పాత్రను పున్నయ్య పోషించారు. తెలంగాణ పోరాట నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణ, ఆయుధాల కొనుగోలు, చేరవేతలో ప్రధాన భాధ్యత బసవ పున్నయ్యదే. సాయుధ పోరాటాన్ని విరమించి విప్లవ మార్గాన్ని చేపట్టటంలో సుందరయ్యతో పాటు బసవ పున్నయ్య సృజనాత్మక పాత్ర నిర్వహించారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగణ్యుల్కెన నాయకులో ఒకరుగా ఎదిగారు. రహస్య జీవనం సాగించిన సందర్భం, ప్రభుత్వం దమన కాండకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన అనుభవాల సాయంతో భారత దేశంలో విప్లవ సాధనకు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చర్చను ప్రారంభిం చిన వారిలో ఒకరిగా, సిపిఎం విప్లవకర వ్యూహ్యాన్ని చేపట్టడంలో కామ్రేడ్ బసవ పున్నయ్య కీలక పాత్రధారి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత పరంగా తీవ్రస్థాయిలో చర్చ సాగిన కాలంలో ఈ అంశంపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులతో చర్చ జరిపే బాధ్యతను పార్టీ కేంద్రకమిటీ కామ్రేడ్ మాకినేనికి అప్పగించింది. మాస్కోలో 1957లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ మహా సభలకు వెళ్ళిన సి.పి.ఐ. ప్రతినిధి వర్గంలో ఆయన సభ్యులు. నాడు దేశంలోనూ, అంతర్జాతీయం గానూ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొం టున్న సమస్యపై మావోసేటుంగ్ తోనూ, లీషావ్‌చి నాయకత్వంలో వచ్చిన చ్కెనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందంతోనూ చర్చజరిపే అవకాశం కామ్రేడ్ ఆయనకు లభిం చింది. శాస్త్రీయమైన, విప్లవకర మార్క్సిజం లెనినిజం సిద్ధాతం పట్ల నిబద్ధతతో కూడిన దేశభక్తి ప్రపూ ర్ణుడు బసవ పున్నయ్య. భారత విప్లవ మార్గానికి స్వతంత్ర వ్యూహా లను, ఎత్తు గడలను అన్వేషించి ప్రజలకు విప్లవ మార్గాన్ని సూచిం చారు. విప్లవ సాధనకు వ్యూహాన్ని రూపొందించే వారు. పీడిత ప్రజల విముక్తి కోసం సైద్ధాంతికంగా, ఆచర ణాత్మకంగా గణనీయమైన కృషి చేస్తూనే పార్లమెంటేరియన్ గానూ రాణించారు. రాజ్యసభ సభ్యుడిగా 1952 నుంచి 1966 వరకు 14 ఏళ్లు కొనసాగారు. బసవ పున్నయ్య ఆరేళ్ల పాటు అజ్ఞాత వాసం సాగించారు. చ్కెనా భారత్ యుద్ధం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను రెండుసార్లు జైల్లో పెట్టింది . చ్కెనా భారత దేశాల మధ్య వివాదాన్ని సంప్రదింపులు, చర్చల ద్వారా మాత్రమే పరిష్క రించు కోవాలని, ఘర్షణ ద్వారా కాదని నొక్కి చెప్పారు. సి.పి.ఐ.(ఎం) ఆవిర్భావం నాటి నుంచి చని పోయే వరకూ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుగా పనిచేసిన కామ్రేడ్ మాకినేని పూర్వపు సోషలిస్టు దేశాల్లో సంభవించిన మార్పుకు సంబంధించి చేసిన సిద్ధాంత పరమైన సూత్రీకరణల్లో క్రీయాశీక పాత్ర నిర్వహించారు. 1990లో సోవియట్ యూనియన్ కుప్ప కూలి, సోషలిష్టు సిద్ధాంతం పైనే దాడి కేంద్రీకరించ బడినా సడలని కమ్యునిస్టు విశ్వాసాన్ని నిలిపిన ధీరుడు బసవ పున్నయ్య. సి.పి.ఐ.(ఎం) అధికార పత్రిక పీపుల్స్ డెమోక్రసీ ఎడిటర్‌గా ఆయన 14 ఏళ్లు పనిచేశారు. సి.పి.ఐ.(ఎం) అభివృద్ధికి, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి వయసుతో నిమిత్తం లేకుండా అవిశ్రాంతంగా కృషిచేశారు. మాకినేని నిరంతరం చదివేవారు, విస్తృతంగా రాసే వారు. కార్యకర్తలు, ఢిల్లీ కార్యాలయం సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేసేవారు. అందుకే ఆయన్ను అందరూ ఎంతో అభిమానించే వారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు సైద్ధాంతిక, వ్యక్తిగత సమస్యపై చర్చించేందుకు అయన అందరికీ ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. బసవ పున్నయ్య గొప్ప ఉపన్యాసకులు. సునిశితమైన రచయితగా అనేక సిద్ధాంత పత్రాలను రచించారు. ఆయనలో మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాత పరిజ్ఞానంతో పాటు అంతర్జా తీయత, దేశభక్తి, తెలుగు జాతీయత కలగలిపి ఉండేవి. విప్ల వోద్యమం కోసం కామ్రేడ్స్ సుంద రయ్య, రాజేశ్వరరావు మున్నగు వారితో సహా, తమ వ్యక్తిగత ఆస్తు లను అమ్మి పార్టీకి ఇచ్చినవారిలో కామ్రేడ్ బసవ పున్నయ్య ఒకరు. కామ్రేడ్ బసవ పున్నయ్య ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాయంలో పార్టీ పనిలో ఉంటూనే 1992 ఏప్రిల్ 12వ తేదీన మరణించారు.

# యాంటీబయాటిక్స్ ఒక పోలిక!

గత మూడు దశాబ్దాలుగా నేను ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రయాణిస్తున్నా. అయితే, భారత్ వెలుపల నేను ఎన్నడూ అనారోగ్యానికి గురికాలేదు, గత నెలలో కాప్ 30 సదస్సు కోసం బ్రెజిల్‌కు వెళ్లేంత వరకూ. అక్కడ ఒక సాధారణ వైరల్ ఫీవర్ నాకు భారత్, బ్రెజిల్ దేశాల్లో యాంటీబయోటిక్స్ వినియోగంలో ఉన్న వ్యత్యాసం కండ్లకు కట్టేలా చేసింది. భారత్‌లో అందరిలాగే నేను కూడా ఫ్యామిలీ డాక్టర్లపై ఆధారపడతాను. సాధారణంగా వచ్చే దగ్గు, జలుబు లాంటి అనారోగ్య సమస్యలకు సైతం నేను వారిని సంప్రదిస్తాను. వారి సలహాలు, సూచనలు తీసుకుంటాను. వారి సలహా మేరకు ఔషధాలు తీసుకుంటాను. అయితే, ప్రతీసారి వారి సలహా మాత్రం ఒకేలా ఉంటుంది. నాకు వైరల్ ఇన్‌ఫెక్షన్ సోకిన ప్రతీసారి వైద్యుడిని సంప్రదిస్తే, వారి ప్రిస్క్రిప్షన్‌లో యాంటీ–అలర్జిక్, యాంటీబయాటిక్ మందులే ఉంటాయి. దానికి వారు చెప్పే కారణం ఒక్కటే, తర్వాతి దశలో బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఉండేందుకేనని. వైరస్‌ల మీద యాంటీబయాటిక్స్ పనిచేయవని తెలిసినా వారి చికిత్స కొనసాగుతుంది. నివారణ అనేది అన్నింటికి ముసుగుగా మారిపోయింది. అయితే, కొన్నేండ్ల క్రితం ఈ విధానం బెడిసికొట్టింది. ఒకసారి యాంటీబయాటిక్స్ వాడగా తీవ్రమైన దగ్గు వచ్చింది. అది నెలలపాటు పట్టిపీడించింది. అప్పటినుంచి యాంటీబయాటిక్స్ విషయంలో అప్రమత్తంగా ఉంటున్నా. అయితే, బ్రెజిల్‌లో నాలుగో రోజు నా ఆరోగ్యం పాడైంది. వైరల్ ఇన్‌ఫెక్షన్ ఎక్కడి నుంచి సోకిందనేది కచ్చితంగా చెప్పలేను. ఆవిరి పీల్చడం, ఉప్పునీటిని పుక్కిలించడం, వేడి నీళ్లు తాగడం, ప్యారాసిటమాల్ వాడటం లాంటివన్నీ చేశాను. అయినా, ఆరో రోజుకు జ్వరం, దగ్గు ఎక్కువయ్యాయి. దాంతో నేను మా డాక్టర్‌ను సంప్రదించాను. నేను ఊహించినట్టుగానే ఆయన ప్యారాసిటమాల్, యాంటీ అలర్జిక్, యాంటీబయాటిక్, గొంతునొప్పిని తగ్గించే మందులు, విటమిన్, దగ్గు ఔషధాలను సూచించారు. నేను ఆ ప్రిస్క్రిప్షన్ తీసుకొని మెడికల్ షాప్‌కు వెళ్లాను. అక్కడ జరిగిన ఘటన నా కండ్లు తెరిపించింది. మొదట, ఆ ప్రిస్క్రిప్షన్‌ను వారు తిరస్కరించారు. బ్రెజిల్ చట్టాల ప్రకారం స్థానిక వైద్యులు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఉండాలి. రెండు, ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయించే లోజెంజెస్, విటమిన్లు, ప్యారాసిట మాల్ లాంటి ఔషధాలను వేరుచేసి, యాంటీబయాటిక్స్‌ను మాత్రం విక్రయించలేమని స్పష్టం చేశాడు. మూడు, ప్రభుత్వ వైద్యుడిని సంప్రదించాలని సూచించాడు. దాంతో నేను అక్కడికి వెళ్లాను. ఆ దవాఖాన అత్యంత శుభ్రంగా ఉంది. అయితే, అక్కడి సిబ్బంది పోర్చుగీస్‌లో మాట్లాడుతున్నారు. నాకు ఇంగ్లీష్ మాత్రమే వచ్చు. ఈ భాషా అంతరాన్ని ఒక ట్రాన్స్‌లేషన్ యాప్ పూడ్చింది. భారతీయ డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను బ్రెజిల్ వైద్యుడికి చూపించా. దాన్ని ఆయన పక్కనపెట్టేశారు. 'మీకు వైరల్ ఇన్‌ఫెక్షన్ సోకింది. 10–12 రోజుల్లో దానంతట




అదే తగ్గిపోతుంది' అని చెప్పారు. ఆయన రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ కూడా చాలా సాధారణంగా ఉంది. జ్వరం ఎక్కువైతే ప్యారాసిటమాల్, గొంతునొప్పికి సప్పరించే గోలీలు, ముక్కుదిబ్బడ తగ్గేందుకు నాజల్ రిన్స్ ఇచ్చారు. యాంటీ బయాటిక్స్, యాంటీ అలర్జిక్ ఇవ్వలేదు. నా కఫం పసుపు–ఆకుపచ్చ రంగులో మారిందని చెప్పగానే ఆయన నవ్వారు (దీన్ని భారత్‌లో కొందరు వైద్యులు బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌కు సంకేతంగా భావిస్తారు). అది ఒక అపోహ మాత్రమేనని, వైరల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు కూడా కఫం ఇలాంటి రంగులో కనిపిస్తుందని ఆయన వివరించారు. అంటే, జలుబు, దగ్గుకు సంబంధించి భారత వైద్యులు చెప్పిన అనేక విషయాలను ఆయన ఖండించినట్టే. నేను స్వల్ప లక్షణాలతోనే భారత్‌కు తిరిగి వచ్చాను. కుతూహలంతో కఫం పరీక్ష చేయించు కున్నాను. కొంత బ్యాక్టీరియా పెరుగుదల ఉందని నివేదిక వచ్చింది. మా డాక్టర్ వెంటనే యాంటీబయాటిక్స్ తీసుకోవాల న్నారు. అయితే బ్రెజిల్ డాక్టర్ మాత్రం యాంటీబయాటిక్స్ అవసరం లేదని, బ్యాక్టీరియా సహజంగానే తగ్గిపోతుందని చెప్పారు. ఈసారి నేను బ్రెజిల్ డాక్టర్ మాటలనే నమ్మాను. మొత్తానికి 13 రోజులకు ఒక్క యాంటీబయాటిక్ గాని, యాంటీ అలర్జిక్ గాని వాడకుండానే పూర్తిగా కోలుకున్నాను. భారతీయ వైద్యులను విమర్శించడానికి ఇదంతా చెప్పడం లేదు. వ్యవస్థాగత వైఫల్యాన్ని ఎత్తిచూపించేందుకే చెప్తున్నాను. ప్రపంచంలోని చాలా దేశాల్లో యాంటీబయాటిక్స్‌ను నిజంగా అవసరమైనప్పుడు చికిత్సా ఔషధాలుగా వాడతారు. కానీ, భారత్‌లో మాత్రం ముందస్తు నివారణ కోసం వినియోగిస్తు న్నారు. మన దేశంలో మానవ శరీరం సహజంగా ఎదుర్కోగల వైరల్ ఇన్‌ఫెక్షన్లకూ యాంటీబయాటిక్స్‌ను సూచిస్తున్నారు. ఈ దుర్వినియోగం, అతివినియోగమే భారతదేశం నేడు ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సంక్షోభానికి కేంద్రబిందు వుగా మారడానికి ప్రధాన కారణమైంది. భారత్‌లో ఏఎంఆర్ కారణంగా ఏటా సుమారు 3 లక్షల మరణాలు సంభవిస్తు న్నట్టు అంచనాలున్నాయి. ఐసీఎంఆర్ ప్రకారం సిప్రోఫ్లాక్సా సిన్, అమోక్సిసిలిన్, అజిత్రోమైసిన్ వంటి సాధారణ యాంటీబయాటిక్స్‌కు ఇప్పటికే ప్రతిఘటన ఎదురవుతున్నది. న్యుమోనియా, బ్లడ్‌స్ట్రీమ్, మూత్రనాళ ఇన్ఫెక్షన్ల విషయంలో 40–70 శాతం ఏఎంఆర్ నమోదవుతున్నట్టు పలు నివేదికల ద్వారా తెలుస్తున్నది. ఇది కేవలం దుర్వినియోగం వల్లే కాదు, భారత్‌లో ఆహార సరఫరా వ్యవస్థలోనూ విచక్షణ లేకుండా యాంటీబయాటిక్స్‌ను ప్రవేశపెట్టడం వల్ల జరుగుతున్నది. కోళ్లు త్వరగా బరువు పెరిగేందుకు, పాల ఉత్పత్తి పెరిగేందుకు వీటిని 'గ్రోత్ ప్రమోటర్స్'గా వాడుతున్నారు. ఈ విధంగా ఏర్పడిన రెసిస్టెంట్ బ్యాక్టీరియా మన శరీరాల్లోకి చేరుతున్నది. ఫలితంగా మనందరం రెసిస్టెంట్ బ్యాక్టీరియా నిల్వలుగా మారిపోతున్నాం. వాస్తవానికి యాంటీబయాటిక్స్ అవసరమైన ఒక తీవ్రమైన ఇన్ఫెక్షన్ సోకిన రోజున పనిచేసే మందులే మన వద్ద ఉండకుండా పోవచ్చు. 201617లలో భారత ప్రభుత్వం 'జాతీయ యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ చర్య ప్రణాళిక' నివేదికను రూపొందించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. నేను ఆ కమిటీ సభ్యుడిని కూడా. మేం నివేదికను సమర్పించాం. కానీ, అది కాగితాలకే పరిమితమైంది. భారత్‌కు, బ్రెజిల్ వంటి దేశాలకు మధ్య ఉన్న అసలైన తేడా వైద్య నైపుణ్యంలో కాదు, విధానాలను కఠినంగా అమలు చేయడంలో ఉన్నది. అవసరం లేనంతవరకు యాంటీబ యాటిక్స్‌ను సూచించకపోవడం, విక్రయించకపోవడమే ఈ సమస్యకు పరిష్కార మార్గం. బ్రెజిల్ డాక్టర్ చెప్పినట్టుగా భయంతో కాదు, అవసరం ఉన్నప్పుడే యాంటీబయాటిక్స్‌ను వాడాలి. ఏఎంఆర్ సంక్షోభాన్ని ఎదుర్కోవాలంటే భారత్‌కు కూడా బ్రెజిల్ వలె వైద్య క్రమశిక్షణ, కఠినమైన విధానాల అమలు అవసరం.

# ఆదివాసీ గడ్డ.. గులాబీ అడ్డా..

## పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై అభిమానం చాటిన గిరిజనులు
## ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో కారు జోరు
## మేజర్ పంచాయతీల్లో బీఆర్ఎస్‌మద్దతిచ్చిన వారికే పట్టం
## ఆసిఫాబాద్ జిల్లాలో 40, ఇచ్చోడ మండలంలోని 15 జీపీల్లో విజయం




**మంచిర్యాల :** 'బీఆర్ఎస్ సర్కారు.. మావ నాటే.. మావ రాజ్.. అన్న గిరిజనుల కలను సాకారం చేసింది. వందలాది గూడేలు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అడవిబిడ్డలను అధికారానికి దగ్గర చేసింది. గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిని మారుమూల గ్రామాల దాహార్తిని 'మిషన్ భగీరథ'తో తీర్చింది. మెరుగైన విద్య, వైద్యాన్ని చేరువ చేసింది. పల్లెలను ప్రగతి పథంలో నడిపించి నంబర్‌వన్‌గా నిలిపింది. పోడు భూములకు పట్టాలిచ్చి రైతు బంధు ద్వారా సాయమందించింది.'.. ఇలా గిరి పుత్రుల కోసం లెక్కకు మించి పథకాలు అమలు చేయగా, వారంతా ఈ పంచాయతీ ఎన్నికల్లో గులాబీ పార్టీకి జై కొట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తొలి విడుత జరిగిన పోరులో అనేకచోట్ల పట్టం కట్టారు. ఆసిఫాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని అనేక గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని కారు జోరును అడ్డుకోలేరని నిరూపించారు.

### బీఆర్ఎస్‌కు జనాదరణ.. కాంగ్రెస్‌పై వ్యతిరేకత

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బొజ్జు ప్రచారం చేసిన గ్రామాల్లోనూ ఆ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులు గెలవలేకపోయారు. పైపెచ్చు గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యేను ఎక్కడికక్కడ ప్రజలు నిలదీసి తమ వ్యతిరేకతను తెలియజేశారు. గడిచిన వారం, పది రోజుల్లోనే దాదాపు నాలుగు గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యే బొజ్జును నిలదీసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అధికార కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఛీత్కరించుకుంటున్నారన్న దానికి ఈ వీడియోలు నిదర్శనంగా నిలిచాయి. ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రధాన కేంద్రమైన ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీలోనూ కాంగ్రెస్ పార్టీ ఓటమి చవిచూసింది. ఉట్నూర్ పక్కనే ఉన్న లక్కారం పంచాయతీలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించారు. ఇక మరో మేజర్ గ్రామపంచాయతీ ఇంద్రవెల్లిలో అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడ స్వయంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోయింది. పలు గిరిజన గ్రామాల్లోనూ హస్తం పార్టీ మద్దతుదారులు ఓటమిపాలయ్యారు. మంచిర్యాల జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండలంలోనూ బీఆర్ఎస్.. అధికార పార్టీకి గట్టిపోటీ ఇచ్చింది. ఈ మండలంలో 11 స్థానాల్లో కాంగ్రెస్ గెలిస్తే, 9 స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు జయకేతనం ఎగురవేశారు. నిర్మల్ జిల్లా పరిధిలోకి వచ్చే కడెం, ఖానాపూర్ , దస్తురాబాద్, పెంబి మండలాల్లోనూ బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు అధికార పార్టీకి గట్టిపోటీ ఇచ్చారు. ఈ మండలాల్లో 19 చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందడం, మేజర్ పంచాయతీలను దక్కించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

### ఆసిఫాబాద్ గులాబీదే..

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ స్పష్టమైన ఆధిక్యం దక్కించుకున్నది. లింగాపూర్, సిర్పూర్ యూ, జైనూర్, వాంకిడి, కెరిమెరి మండలాల్లో మొత్తం 109 స్థానాల్లో ఎన్నికలు జరిగితే 40 స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులను గెలిపించారు. 33 స్థానాల్లో ఇండిపెండెంట్‌లు గెలిచారు. 31 సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే, 5 స్థానాలతో బీజేపీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఉండి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే నార్నూర్ మండలంలో 16 జీపీలను బీఆర్ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకోగా, ఏడుచోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. గాదిగూడ మండలంలో 14 చోట్ల బీఆర్ఎస్ గెలిచింది. ఆదివాసీలు, గిరిజనులు అధికంగా ఉండే ఈ మండలాల్లో బీఆర్ఎస్ సత్తా చాటింది. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు గెలుపొందారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు కాంగ్రెస్, నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. ఇద్దరు ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా జనాల విశ్వాసాన్ని చూరగొన్న పార్టీలో పల్లెపోరులో సత్తా చాటింది. అధికార పార్టీకి గట్టిపోటీ ఇస్తూ తొలి విడుతలో 120 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నది. గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థుల్లో బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన వారిని కలుపుకుంటే అధికార పార్టీకి తీసిపోకుండా స్థానాలు వస్తున్నాయి. ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. తొలి విడుత పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటిన గులాబీ సైనికులు, డిసెంబర్ 14వ తేదీన నిర్వహించే రెండో విడుత ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో కదం తొక్కేందుకు సిద్ధం అవుతున్నారు

# ఓటమి.. నైరాశ్యం



**ఆదిలాబాద్:** ఇటీవల ఇంద్రవెల్లిలో ఓ వార్డు సభ్యుడిగా పోటీ చేసిన యువ సామాజిక కార్యకర్త ఓటమిపాలయ్యాడు. తన అంచనాల ప్రకారం గెలు పు ఖాయమనుకున్నాడు. అనుకున్న దొక్కటైతే.. అ య్యింది మరొకటి అన్నట్లు పరాజయం తలుపుతట్టింది. ఎందుకిలా జరిగిందని లెక్కలు వేశాడు. ఎక్కడ ఓట్లు చేజారాయనే సమీకరణలు తీశాడు. ఒకవేళ ఆ ఓట్లు పడి ఉంటే తన గెలుపు ఖాయమని అనుకున్నాడు. తనకు వారు ఓటు వేయలేదని నిర్ధారించుకున్నాడు. విషయాన్ని జీర్ణించుకోలేకపోయా డు. నా ఓటమికి నువ్వే కారణమంటూ నేరుగా వేలెత్తి చూపాడు. మొదటి విడత పంచాయతీ ఫలితాలు వెలువడిన తర్వాత ఇంద్రవెల్లిలో జరిగిన ఈ ఘట న ఇప్పుడు అంతటా చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఔరా అనుకునే పరిస్థితి తలెత్తింది. ఓటమి చెందిన చోటే గెలుపును వెతుక్కోవాలంటారు.. ఇది ఏ రంగానికైనా వర్తిస్తుందని పెద్దలు చెబుతుంటారు. రాజకీయాల్లోకి వచ్చిన యువత తొలిసారి పరాజయం చవిచూస్తే ఓర్పు ప్రదర్శించాలి తప్ప నిరాశకు గురికావద్దు. విజయం దిశగా మరో ప్రయత్నం చేయాలి. అంతేకానీ ఇతరులను నిందించడం సరికాదు. ఇంద్రవెల్లిలో జరిగిన ఘట న ఓటర్లను విస్తుపోయేలా చేసింది. ఆ వార్డులో ఓ సామాజికవర్గం వారు అధిక సంఖ్యలో ఉండటం, గెలిచిన వ్యక్తి అదే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో ఓటమి చెందిన అతడికి సందేహాలు తలెత్తాయి. ఆ సామాజికవర్గం వ్యక్తులు తనకు ఓటు వేయలేదని అనుమానించాడు. ఇంకేముంది ఆ వర్గానికి చెందిన పెద్దను ఫోన్‌లో దూషించాడు. ఈ పరిణామాన్ని ఊహించని ఆ పెద్ద తన అనుచరులతో కలిసి శనివారం మార్కెట్ బంద్ చేయించి నిరసన తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఇది హాట్‌టాపిక్‌గా మారింది. ఓడిపోతే ఇలా అంటారా అనే ప్రశ్న తలెత్తుతోంది.

### ఇంకెన్నెన్నో ..

మొదటి విడత పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యా యి. ఫలితాలు వచ్చాయి. సర్పంచ్‌లు ఎవరనేది తేలిపోయింది. ఉప సర్పంచ్‌ల ఎన్నిక కూడా జరి గిపోయింది. పార్టీల బలాబలాలు స్పష్టమయ్యా యి. ఓటమి చెందిన వారు మాత్రం తాము ఖర్చు చేసిన డబ్బులకు సంబంధించి లెక్కలు కడుతున్నారు. ఎక్కడెక్కడైతే డబ్బులు పంచారో ఆ ఓట్లు పడ్డా యా లేదా అనే సమీకరణాలు వేసుకుంటున్నారు. కొంతమంది ఈ ఎన్నికల ద్వారా ఆర్థికంగా చతికిలపడ్డారు. అయినప్పటికీ పలువురు ఓర్పు ప్రదర్శిస్తున్నారు. మరికొందరు మాత్రం దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ రోజు రెండో విడత, ఈనెల 17న మూడో విడత ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి చిత్రవిచిత్రాలు ఇంకెన్ని చోటు చేసుకుంటాయో చూడాల్సిందే.

# ఖమ్మం రూరల్‌లో రికార్డు స్థాయి పోలింగ్ నమోదు

**ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు అయింది. ఖమ్మం జిల్లావ్యాప్తంగా 6 మండలాలలో కలిపి 85.95% పోలింగ్ నమోదు కాగా అత్యంత రికార్డు స్థాయిలో ఖమ్మం రూరల్ మండలంలో 91.3 % ఓట్లు నమోదై చరిత్ర సృష్టించినట్లయింది. మండలంలో మొత్తం ఓటర్లు 33 వేల ఎనిమిది వందల యాభై ఒక్క మంది కాగా వారిలో 30 వేల ఎనిమిది వందల 16 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రకటించారు. మధ్యాహ్నం ఒంటిగంట లోపు క్యూ లైన్ లో ఉన్న ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించామని, ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 19 పంచాయతీల సర్పంచుల అభ్యర్థులకు 184 వార్డు నియోజకవర్గం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయననారు. ఖమ్మం రూరల్ ఏసీబీ తిరుపతిరెడ్డి, డిసిపి అడ్మిన్ విజయబాబు, ఏఆర్ ఏసిపి నర్సయ్య, పోలీసు సిబ్బంది అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో బందోబస్తు చర్యలు చేపట్టారు.



## మాజీ సింగరేణియులు పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుర్గం రామచందర్, జనరల్ మేనేజర్




**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** మంగళవారం నాడు ట్రైపార్టైట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం, పెన్షన్ అదాలత్ మరియు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమాల్లో భాగంగా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ఉదయం 10.00 గంటలకు, యం.వి.టి.సి, పైలట్ కాలనీ, మణుగూరు ఏరియా నందు పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహించబడుతుంది. మణుగూరు ఏరియాలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన మాజీ సింగరేణియులు, తాము పొందుతున్న పెన్షన్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత ధృవీకరణ పత్రాలతో 16.12.2025 ఉదయం 10.00 గంటలకు పై పేర్కొన్న స్థలంలో నిర్వహించబడే పెన్షన్ అదాలత్‌కు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు.

## ప్రజా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నా..!

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

ఓటేసి సేవ చేసే భాగ్యం కల్పించండి అబద్ధాలు చెప్పను. అభివృద్ధి చేస్తా

గాంధీనగర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి ముఖ్య కృష్ణ నాయక్



**సామాన్యుడు అస్త్రం :** జూలూరుపాడు మండలంలోని గాంధీనగర్ పంచాయతీ అభి వృద్ధి చేసుకుందాం మీ అమూల్యమైన ఓటు నాకు వేసి గెలిపించాలని స్వతంత్రియ అభ్యర్థి భూక్య కృష్ణ నాయక్ అన్నారు. గాంధీనగర్ గ్రామపంచాయతీ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది అభివృద్ధిలోను అగ్రగా మిగా ముందు ఉంచుతానని అన్నారు. ఈ సందర్భంగా ఓటర్లతో కృష్ణ నాయక్ మాట్లాడుతూ గ్రామంలోని అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయిన పనులు పరిష్కారం కావాల్సిన పనులు ఎన్నో ఉన్నాయని వాటిని అధికారులతో ప్రశ్నించి పరిష్కరించే దిశగా గ్రామంలోని పలు రకాల యువజన సంఘాల నాయకులు మహిళా సంఘాలు గ్రామస్తుల సహాయ సహకారాలతో ముందుకు సాగు తానని గ్రామ అభివృద్ధి కోసం చేపట్టబోయే ప్రతి కార్యక్రమం ప్రజలకు తెలియజేసిన తర్వాతనే శ్రీకారం చుడతానని తెలిపారు. ప్రభుత్వ ప్రయోజన పథకాలు అర్హులైన ప్రతి కుటుంబాలకు అందేలా చూస్తానని యువతకు ఉపాధి అవకాశాలు మహిళా సంఘాల సభ్యుల శ్రేయస్సు కోసం పలు రకాల ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలను ఏర్పాటు చేస్తానని తాను అబద్ధాలు చెప్పనని చెప్పిన అభివృద్ధి చేసి చూపించడానికి తాను సిద్ధంగా ఉంటానని, ప్రజాసేవయే లక్ష్యంగా ఊరికి సేవ చేసుకొని గాంధీనగర్ గ్రామపంచాయతీ పేరు ఆదర్శ గ్రామంగా నిలపాలని ఉద్దేశంతోనే పోటీ చేస్తున్నానని తెలిపారు. గెలిచిన త్వరలోనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని తెలిపారు. గ్రామంలో వైద్యం విద్య ఉపాధి అవకాశాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా చూస్తానని అన్నారు. గ్రామ ప్రజలు ఒకసారి ఆలోచించి ఈ ఎన్నికల్లో ఫుడ్ బల్ గుర్తుకు ఓటు వేసి సర్పంచుగా గెలిపించాలని భూక్యా కృష్ణ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## అడుగడుగున గుంతల మయం..
## కంకర రోడ్డుపై ప్రయాణం అయోమయం

**నార్నూర్ :** ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం మారేగావ్ నుంచి కొలమ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలి అడుగు అడుగున గుంతల మయంగా మారింది. హీరాపూర్, పర్సవాడ, తోయాగూడా, కొలామ, బుద్ధ గూడా గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో వాహనాలు మరమ్మతులకు గురి అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రయాణం నరకంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకునే నాధుడే కరువయ్యారని వాపోతున్నారు. వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ఆ పంచాయతీలు.. చాలా హాట్ గురూ!

**కై లాస్‌నగర్:** జిల్లాలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతంతో పాటు పలు మండల కేంద్రాలు, పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు ఖరీదైనవిగా మారాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే రాజకీయ పలుకబడితో ఇసుక, రియల్ దందాలను శాసించే అధికారం వస్తోందనే భావనతో పలువురు బరిలోకి దిగారు. రూ. లక్షల్లో అక్రమ ఆదాయం సమకూరే అవకాశముండటంతో సర్పంచ్, వార్డుమెంబర్లుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడటం లేదు. పదవీ ద క్కితే ఐదేళ్ల పాటు తిరుగుండదు. ఆదాయానికి కొదవుండదు. ఈ క్రమంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఖర్చుకు ఏమాత్రం వెనుకాడడం లేదు. రూ.లక్షలు గుమ్మరిస్తున్నారు. మద్యాన్ని గ్రామాల్లో ఏరులుగా పారిస్తున్నారు. పోటాపోటీగా కుల సంఘాలతో ఒప్పందాలు, యువకులకు దావత్‌లు, ఇంటింటా డబ్బు, మద్యం పంపిణీ చేస్తూ పోల్ మేనేజ్‌మెంట్ పకడ్బందీగా చేపడుతున్నారు.

### అక్రమ దందాలతో ఆదాయం..

పెన్‌గంగ నది పరీవాహకంలోని భీంపూర్, బేల, జైనథ్, భోరజ్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఇసు క దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆయా గ్రామాల్లో పేరుకుపోయిన ఇసుక నిల్వలకు వీడీసీల ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తున్నారు. ఇసుక లభ్యత ప్ర కారం ఒక్కో గ్రామంలోని నిల్వలకు రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు వేలం ద్వారా అప్పగిస్తున్నారు. ఈ వ్యవహారంలో సర్పంచ్‌ల పాత్రనే కీల కం. రాజకీయ పలుకుబడి ఉండటంతో తమ అక్రమ దందాకు అడ్డు రాకుండా ఉండేందుకు గా ను ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ఇసుక నిల్వలను దక్కించుకున్న వారు రూ.లక్షల్లో ముట్టజెబుతున్నారు. ఇది బహిరంగ రహస్యమే కావడంతో ఇసు క నిల్వలు కలిగిన గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

# వైద్యం కోసం వచ్చిన ప్రజలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆకలి తీర్చినా జనగామ పట్టణ ఏ ఎస్ఐ డి మనోహర్ రావు

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ పట్టణ ఏఎస్ఐ డి మనోహర్ రావు సార్ మానవతా దృక్పథంతో జనగామ జిల్లా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ జనగామ పట్టణ ఏఎస్ఐ డి మనోహర్ రావు సార్ కరోనా కష్టకాలంలో ఎంతోమంది ప్రజలకు నిత్యవసర సరుకులు అందించారు నిరంతరం జనగామ అమ్మ ఫౌండేషన్ చేసే సేవా కార్యక్రమాల్లో నిరాశ్రయులకు మతిస్థిమితం లేని వారికి అనాధలు మృతి చెందిన అనేక సందర్భాలలో తనకు తోచినంత సహాయం చేసి జనగామ అమ్మ ఫౌండేషన్ టీం తో ఎనలేని అనుబంధం జనగామ అమ్మ ఫౌండేషన్ ఉగాది పురస్కారాల కార్యక్రమానికి మరియు అనేక సందర్భాల్లో తనకు తోచినంత సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారని ఉన్నతమైన విలువలతో జనగామ అమ్మ ఫౌండేషన్ చేసే సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయం చేస్తూ మనవత్వాన్ని చాటుకుంటున్నారని జనగామ ఏఎస్ఐ డి మనోహర్ రావు సార్ కి అమ్మ ఫౌండేషన్ టీం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడా రవి, పండుగ నరేష్ బోట్ల సాయి, తుంగ సతీష్, బింగి నరసింహులు, కుకట్ల సాయికిరణ్, సిద్ధిరాల








నవీన్, కొయ్యడా విశ్వ, ఎండి అప్రోచ్ ఎండి యాకుబ్,గునిగంటి నర్సింగరావు, పల్లె హరీష్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు

# బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత, ప్రమాణాలు తప్పనిసరి

**తడిగిరి కే.చీడిపుట్టు బర్రెల బంధ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అరకు నియోజకవర్గంలోని హుకుంపేట మండలం తడిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో కీలకమైన బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. తడిగిరి గ్రామం నుంచి కే.చీడిపుట్టు మీదుగా బర్రెల బంధ గ్రామం వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవున, రూ.5 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో (ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నిధులతో) చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా హాజరై ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. నాలుగు కాలాలు మన్నికగా ఉండే రోడ్డు నిర్మించాలి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత, సాంకేతిక ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలి అని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నాలుగు కాలాల పాటు మన్నికగా ఉండేలా పనులు చేపట్టి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలి అని సూచించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రహదారులే ప్రధాన ఆధారం అని, గ్రామీణ ప్రాంతాల అనుసంధానంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధికి రహదారులే మూలస్తంభం ఈ రహదారి నిర్మాణంతో తడిగిరి, కే.చీడిపుట్టు, బర్రెల బంధ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడి, విద్య, వైద్యం, మార్కెట్ వ్యవస్థలకు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ



కార్యక్రమంలో హుకుంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ సమ్మిడి వెంకట పూర్ణిమ, కొంతిలి గ్రామ పంచాయతీ సర్పంచ్ రేగం రమేష్, వైసీపీ హుకుంపేట మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్, మండల ఉపాధ్యక్షుడు వెంకట్ రావ్, హుకుంపేట మండలం వైస్ ఎంపీపీ కొండల రావు, తడిగిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ రంజిత్, వైఎస్సార్సీపీ నాయకులు మత్స్యలింగం, భవాని శంకర్, రామకృష్ణ, నిలకంఠం, విశ్వేశ్, ధౌడన్న, కర్రన్న, ట్రైబల్ వెల్ఫేర్ విభాగం ఏఈ తుడుము బొంజు బాబు, ఇరిగేషన్ విభాగం ఏఈ సతీష్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాలు 2025

**మణుగూరు ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహణ**

**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** మణుగూరు ఏరియా పరిధిలోని ఏరియా హాస్పిటల్, మణుగూరు నందు 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాలు 2025 సందర్భంగా ఒక భవ్యమైన, ప్రేరణాత్మక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ఉద్యోగుల్లో భద్రతా అవగాహన, ఆరోగ్య అప్రమత్తత మరియు ప్రమాదాల నివారణ పట్ల బాధ్యతాభావాన్ని మరింత బలోపేతం చేయడం కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి కన్వీనర్గా పి. రమేష్ బాబు, డిప్యూటీ సీఎంఓ, ఆర్కే 8 డిస్పెన్సరీ, శ్రీరాంపూర్ ఏరియా కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుర్గం రామచందర్, జనరల్ మేనేజర్, మణుగూరు ఏరియా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రత అనేది కేవలం నిబంధన మాత్రమే కాకుండా జీవన విధానంగా మారాలని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి పని ప్రదేశంలో భద్రతా నియమాలను కఠినంగా పాటించడంతో పాటు, హెల్మెట్ తదితర భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన ఉద్యోగులే సంస్థకు అతిపెద్ద బలమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియా సింగరేణి కళాకారులు ప్రదర్శించిన “మానవ సేవే మాధవ సేవ” అనే సందేశాత్మక నాటిక హాజరైన వారిని ఆలోచింపజేసింది. ఈ నాటిక ద్వారా ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యం, హెల్మెట్ వినియోగం అవసరం, రక్తదానం ప్రాణదానం, అలాగే ఆరోగ్యం మరియు భద్రత పట్ల అవగాహన వంటి అంశాలను అత్యంత ప్రభావవంతంగా ప్రదర్శించారు. కార్యక్రమం అనంతరం తనిఖీ బృందం ద్వారా ఏరియా హాస్పిటల్ను సమగ్రంగా తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, శుభ్రతా నిర్వహణ మరియు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కమిటీ సభ్యులు పి. హరిశంకర్ రావు, డీజీఎం (ఐటీ), కార్పొరేట్ డా. పి. శేషగిరి రావు, మెడికల్






సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్, మణుగూరు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఈ కార్యక్రమంలో ఎస్.ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి, డి. వెంకట రామారావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్, ఈ. శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఎంఎన్జి ఓసి, ఏఐటీయూసీ నాయకుడు మేకల ఈశ్వర్, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ వి. మదన్ నాయక్, డిప్యూటీ సీఎంఓ జ్యోతిర్మయి, ఎస్. రమేష్, డీజీఎం (పర్సనల్), జి. శివప్రసాద్, డీజీఎం (సివిల్), డా. టీ. సురేష్, డా. ఇన్నయ్య, డా. కే.వెంకట రమణయ్య, ఇతర అధికారులు, ఏరియా హాస్పిటల్ వైద్య, పారా వైద్య సిబ్బంది మరియు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భద్రత, ఆరోగ్యం మరియు సామాజిక బాధ్యత పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగిస్తూ విజయవంతంగా ముగిసింది.రి

## ఇబ్రహీంపూర్ గ్రామ ఉప సర్పంచ్ గా ఉన్నత విద్యావంతుడు



**సామాన్యుడి అస్త్రం జనగామ** ఇబ్రహీంపూర్ గ్రామ ఉప సర్పంచ్ గా ఉన్నత విద్యావంతుడు గ్రామానికి చెందిన చింత నరేష్ ఉస్మానియా యూనివర్సిటీలో సామాజిక సేవ లో పీజీ చేసిన స్టూడెంట్ గా గ్రామానికి సేవ చేయాలనే దృక్పథంతో మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఉపసర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది గతంలో తాను వార్డు సభ్యుడుగా గ్రామానికి ఎన్నో సేవలు అందిస్తూనే మరోపక్క హనుమకొండలో ప్రస్తుతం ఓ ప్రైవేటు కాలేజీలో లా డిగ్రీ చేస్తున్నాడు తన మీద నమ్మకంతో ఉప సర్పంచ్ ఎన్నికకు సహకరించిన గ్రామ పెద్దలు లింగాల జగదీష్ చందర్ రెడ్డి కి మరియు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కలిసి రావాలని కోరుతున్నాను

## పెద్దమడూర్ యువ న్యాయవాది వేణుకు హైకోర్టులో ఘన స్వాగతం.



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ జిల్లా పెద్దమడూరు గ్రామానికి చెందిన నాగిళ్ళ కిష్టయ్య–అనసూర్య గార్ల కుమారుడు యువ న్యాయవాది నాగిళ్ళ వేణు న్యాయ రంగంలో అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం హైకోర్టులో ఘనంగా సన్మానించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వేణు చిన్న వయసులోనే న్యాయ రంగంపై ఆసక్తి చూపి, క్రమశిక్షణతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నారని, ఈ స్థాయి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం అని అభిప్రాయపడ్డాడు. గ్రామీణ నేపథ్యం ఉన్న వేణు ఎంతో కష్టపడి , పట్టుదలతో “లా” విద్యను పూర్తి చేసి హైకోర్ట్ లో అడ్వకేట్ గా నమోదు అవ్వడం పెద్దమాడురు గ్రామ ప్రజలకు గర్వకారణం అని తెలిపారు. వేణు చిన్న వయసు నుండే సామాజిక సేవ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు ఈ యొక్క కార్యక్రమ సందర్భంగా పెద్దలు, ప్రముఖులు వేణు ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ నా విజయానికి కారణం నా తల్లితండ్రులు, నా భార్య అలాగే నాకు విద్యను అందించిన నా గురువులు నా కుటుంబ సభ్యులందరి ప్రోత్సాహంమే కారణం అని అన్నారు. సమాజానికి న్యాయం జరిగేలా నా వంతు కృషి నేను చేస్తాను. ఖచ్చితంగా న్యాయాన్ని అందరికీ సమానంగా పంచుతనని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు బార్ కౌన్సిల్ అసోసియేషన్ సభ్యులు , బందువులు స్నేహితులు పాల్గొన్నారు.

## మాకు సర్పంచ్ గా లావుడియా ద్వాలీ కావాలి

**మహేంద్రుడే గెలవాలి**

**భోజ్యతండ గ్రామపంచాయతీ ప్రజల ప్రతినోటా ఇదే మాట**



**సామాన్యుడి అస్త్రం ఖమ్మం :** జూలూరుపాడు మండలంలోని బోజ్య తండా గ్రామపంచాయతీలో ప్రజాసేవకు నేను సిద్ధం అవకాశం ఇవ్వండి అంటూ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆశీర్వాదంతో మీ ముందుకు వస్తున్నాను ఆశీర్వదించండి గెలిపించండి అభివృద్ధి వైపు నడిపించండి అని లావుడియా ద్వాలి మీడియా ముఖంగా తెలియజేశారు. విద్యాభివృద్ధి గ్రామ అభివృద్ధి నా లక్ష్యమని నిస్వార్థ రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క నిరుపేదిక అందిస్తానని తెలియజేయడం జరిగింది. ఆశతో రాజకీయాల్లోకి వచ్చేవాలకి కాదు ఆశయంతో రాజకీయాలకు వచ్చే వారికి ఆదరించండి అభిమానించి అభివృద్ధి చేసి చూపిస్తామని లావుడియా ద్వాలీ తెలియజేశారు. ప్రతి ఇంటికి తాగు నీరు.స్వచ్ భారత్ కార్యక్రమాలు. గ్రామంలో నిలిచిపోయిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని స్వతహాగా ముందుకు తీసుకువచ్చి గ్రామపంచాయతీ తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. ఓటర్ మహాశయులంతా ఈ ఒక్క సారి ఆశీర్వదించి గెలిపించగలరని తెలియజేశారు.

# ఆయుర్వేద స్నాన రహస్యాలు..



ఆధునిక జీవిత శైలిలో, చాలామంది వ్యక్తులు ఉదయం నుంచే పనుల హడావుడిలో పడి, స్నానాన్ని కేవలం త్వరగా ముగించే ఒక రొటీన్‌గా పరిగణిస్తుంటారు. ఇలాంటి త్వరిత స్నానాలు శరీరాన్ని క్లీన్ చేస్తాయి అని అనుకుంటున్నప్పటికీ, అవి మన శరీరానికి రోజువారీ శ్రమను పూర్తిగా తొలగించలేకపోతాయి. నిజమైన స్నానం అంటే, శరీరం మరియు మనసును పూర్తిగా ప్రశాంతింపజేసే, శక్తిని పునరుద్ధరించే ప్రక్రియ. ఇది కేవలం నీటితో మునిగిపోవడం మాత్రమే కాకుండా, శరీరాన్ని పోషించే సహజ పదార్థాలతో మిళితమైన ఒక ఆచారం. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం, ఇలాంటి స్నానాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరచి, రోజంతా ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ఆయుర్వేదం శాస్త్రంలో స్నానాన్ని ఒక ముఖ్యమైన రోగనిరోధక చర్యగా పరిగణిస్తారు, ఎందుకంటే ఇది శరీరంలోని టాక్సిన్లను తొలగించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. సాధారణ నీటితో స్నానం చేస్తే శుభ్రత మాత్రమే వస్తుంది, కానీ ఆయుర్వేద పద్ధతుల ప్రకారం, స్నాన నీటిలో సహజ పదార్థాలు కలిపితే శరీరం మరింత హాయిగా, శక్తివంతంగా మారుతుంది. ఈ పదార్థాలు శరీరాన్ని శుద్ధి చేయడమే కాకుండా, చర్మానికి తేమను అందించి, మానసిక శాంతిని కలిగిస్తాయి. ముఖ్యంగా, రోజువారీ ఒత్తిడి మధ్య ఇలాంటి స్నానాలు మనసును ప్రశాంతం చేసి, రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఈ విధంగా, స్నానం కేవలం ఒక శౌచక్రియ కాకుండా, ఒక సంపూర్ణ ఆరోగ్య చికిత్సగా మారుతుంది. సువాసిత స్నానం కోసం, స్నాన నీటిలో గంధం పొడి, మల్లెలు, గులాబీ రేకలు వంటి సహజ పదార్థాలు కలిపడం అద్భుతమైన ఫలితాన్ని ఇస్తుంది. గంధం పొడి శరీరాన్ని శుద్ధి చేస్తూ, చర్మానికి మృదుత్వాన్ని అందిస్తుంది, మరియు దాని సుగంధం మనసును ఉత్తేజపరుస్తుంది. మల్లెలు మరియు గులాబీ రేకలు కలిపితే, నీటి నుంచి వ్యాపించే చక్కని వాసన శరీరమంతా మన్నిక చేస్తుంది, ఇది రోజంతా మనల్ని ఫ్రెష్‌గా ఉంచుతుంది. ఈ పదార్థాలు చర్మ పోర్స్‌లను తెరిచి, టాక్సిన్లను బయటకు తీసుకువెళ్తాయి, తద్వారా చర్మం మరింత మెరిసిపోతుంది. ఇలాంటి స్నానం తర్వాత, మీరు స్పా నుంచి వచ్చినట్టు అనుభూతి చెందుతారు, మరియు ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగకరం. శరీరంలోని శ్రమను తొలగించడానికి, కమలాపండు మరియు నిమ్మతొక్కలను వేడి నీటిలో కలిపి స్నానం చేయడం ఆయుర్వేదంలో ప్రసిద్ధమైన పద్ధతి. కమలాపండు యొక్క ఆహారవంతమైన గుణాలు శరీరాన్ని తేలికపరుస్తాయి, మరియు అది మాంసపేశుల బిగుతును తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. నిమ్మతొక్కలు యాంటీబాక్టీరియల్ లక్షణాలతో కలిసి, చర్మాన్ని శుద్ధి చేస్తూ, శరీరానికి శక్తిని పునరుద్ధరిస్తాయి. వేడి నీటిలో ఈ పదార్థాలు కలిపి 10-15 నిమిషాలు మునిగిపోతే, శ్రమ మరియు అలసట అదృశ్యమవుతాయి, మరియు మీరు తేలికగా, ఉత్సాహంగా అనుభవిస్తారు. ఈ స్నానం రోజువారీ రొటీన్‌లో చేర్చుకుంటే, మీ ఆరోగ్యం మరింత బలపడుతుంది, మరియు ఆయుర్వేద గ్రంథాల ప్రకారం ఇది దీర్ఘాయుష్షుకు కూడా సహాయపడుతుంది.

# గర్భధారణ.. మహిళల్లో వృద్ధాప్యానికి కారణమా?



సమకాలీన వైద్య పరిశోధనలు మన జీవితశైలి మరియు శరీర మార్పులపై ఆసక్తికర దృక్పథాలను తెలియజేస్తున్నాయి. ఇటీవల న్యూయార్క్‌లోని ప్రసిద్ధ కొలంబియా యూనివర్సిటీ మెయిల్మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన ఒక అధ్యయనం, మహిళల్లో గర్భధారణ జీవ సంబంధమైన వృద్ధాప్యాన్ని గణనీయంగా వేగవంతం చేస్తుందని ఆశ్చర్యకరంగా వెల్లడించింది. ఈ పరిశోధనలో పాల్గొన్న మహిళల్లో, గర్భం దాల్చినవారు తమ సమాన వయస్సు సహచరులతో పోల్చినప్పుడు శారీరకంగా మరింత పెద్దవారిగా కనిపించారు. ఈ ఫలితాలు మానవ శరీరంలో గర్భధారణ సంబంధిత జీవక్రియలు ఎలాంటి మార్పులను తీసుకువస్తాయో గుర్తించడానికి శాస్త్రవేత్తలకు కొత్త ఆలోచనలను అందించాయి. ఈ అధ్యయనం శరీరంలోని సెల్యులర్ మార్పులు మరియు జన్యు స్థాయిలో జరిగే ప్రక్రియలపై దృష్టి సారించింది. గర్భధారణ సమయంలో మహిళల శరీరం అనేక భారీ మార్పులను ఎదుర్కొంటుంది, ఇవి జీవశాస్త్రపరమైన వృద్ధాప్యాన్ని త్వరగా పెంచుతాయని పరిశోధకులు గుర్తించారు. గర్భం దాల్చిన స్త్రీల్లో, టెలోమెర్లు అనే క్రోమాసోమ్ చివరి భాగాలు త్వరగా చదరపడటం గమనించబడింది, ఇది సెల్‌ల పాతపడటానికి ప్రధాన కారణం. ఈ మార్పు గర్భధారణ సమయంలో శరీరం శిశువు అభివృద్ధికి అవసరమైన ఎనర్జీ మరియు పోషకాలను ప్రాధాన్యతగా కేటాయించడం వల్ల జరుగుతుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఫలితంగా, గర్భం దాల్చని మహిళలతో పోల్చినప్పుడు, ఈ స్త్రీలు చర్మం, ఎముకలు మరియు ఇతర శారీరక లక్షణాల్లో మరింత వృద్ధాప్య సంకేతాలను చూపిస్తారు. ఈ ప్రక్రియ శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచడం ద్వారా మరింత తీవ్రమవుతుందని అధ్యయనం సూచిస్తోంది. అద్భుతంగా, ఈ జీవశాస్త్రపరమైన మార్పులు పురుషుల్లో కనుగొనబడలేదని పరిశోధన ఫలితాలు స్పష్టం చేశాయి. పురుషుల శరీరంలో గర్భధారణ లేదా ఇలాంటి భారీ పునరుత్పత్తి ప్రక్రియలు లేనందున, వారి టెలోమెర్ చదరపడటం సాధారణ జీవనశైలి కారణాలపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. ఈ అధ్యయనంలో పాల్గొన్న పురుషులు మరియు మహిళల మధ్య పోలిక చేసినప్పుడు, మహిళల్లో మాత్రమే గర్భధారణ సంబంధిత వృద్ధాప్య వేగం గణనీయంగా ఎక్కువగా ఉందని గుర్తించారు. ఇది లింగ భేదాలు మరియు పునరుత్పత్తి ఆరోగ్యం మధ్య ఉన్న సంబంధాన్ని హైలైట్ చేస్తుంది. పరిశోధకులు ఈ ఫలితాలు మహిళల ఆరోగ్య సంరక్షణలో కొత్త వైద్య విధానాలకు దారితీస్తాయని ఆశిస్తున్నారు. ఈ పరిశోధన ఫలితాలు మహిళలకు గర్భధారణ మరియు దీర్ఘకాలిక ఆరోగ్యం మధ్య సమతుల్యతను కనుగొనడానికి ముఖ్యమైనది. గర్భధారణ తర్వాత వృద్ధాప్య సంకేతాలను నియంత్రించడానికి జీవనశైలి మార్పులు, పోషకాహారం మరియు వ్యాయామం ప్రాముఖ్యతను పరిశోధకులు ఒత్తిడి చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ జ్ఞానాన్ని ఉపయోగించుకుని, మహిళల్లో వృద్ధాప్యాన్ని వాయిదా వేయడానికి కొత్త చికిత్సలు అభివృద్ధి చేయవచ్చని వారు భావిస్తున్నారు. మొత్తంగా, ఈ అధ్యయనం మానవ జీవిత చక్రంలో పునరుత్పత్తి పాత్రను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. ఇలాంటి కొత్త ఆవిష్కరణలు వైద్య శాస్త్రంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తాయని ఆశించవచ్చు.

## మహిళలలో మాసిక నొప్పులు.. సాధారణమా, లేక సమస్యా?



మహిళల్లో మాసిక రక్తస్రావం సమయంలో నొప్పి అనేది సాధారణ సమస్యగా కనిపించినప్పటికీ, దీని తీవ్రత మరియు స్వభావం ఆరోగ్య స్థితిని సూచిస్తుంది. ప్రైమరీ డిస్‌మెనోరియా అనే పరిస్థితి, మాసిక చక్రం ప్రారంభమైనప్పటి నుంచి కనిపించే సాధారణ నొప్పి. ఇది సాధారణంగా మొదటి రెండు రోజుల్లో మాత్రమే ఉంటుంది మరియు ఇది యూటరస్ కంట్రాక్షన్‌ల వల్ల వచ్చే సహజ ప్రక్రియ. ఈ నొప్పి తలనొప్పి, వికారం లేదా వాంతులతో కూడి ఉండవచ్చు, కానీ ఇది ఏదైనా తీవ్రమైన వ్యాధి సూచన కాదు. చాలా మంది మహిళలు హాట్ వాటర్ బాగ్ లేదా సాధారణ మందులతో దీన్ని నిర్వహిస్తారు. సెకండరీ డిస్‌మెనోరియా అయితే, మాసిక చక్రం ప్రారంభమైన తర్వాత కొన్ని సంవత్సరాల తర్వాత కనిపించే అసాధారణ నొప్పి. ఇక్కడ నొప్పి మాసికం ముందు లేదా తర్వాత కూడా కొనసాగుతుంది మరియు తీవ్రంగా ఉంటుంది, ఇది ఎండోమెట్రియోసిస్ లేదా యూటరస్ ఇన్ఫెక్షన్‌ల వంటి దాచిన సమస్యలకు సంకేతం. ఈ పరిస్థితిలో మహిళలు తమ రోజువారీ పనులు చేయలేకపోతారు మరియు నొప్పి శరీరం ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. ఇది మాత్రమే కాకుండా, మూత్ర మార్గ సంక్రమణలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉండవచ్చు. ఈ రకమైన మార్పులు గమనించకపోతే, దీర్ఘకాలిక సమస్యలకు దారి తీస్తాయి. ప్రైమరీ మరియు సెకండరీ డిస్‌మెనోరియా మధ్య ముఖ్యమైన తేడా అవి యూటరస్ లేదా ఇతర గైనకాలజికల్ సమస్యలతో సంబంధం ఉన్నాయా లేదా అని. ప్రైమరీలో నొప్పి మాత్రమే పరిమితమై ఉంటుంది, కానీ సెకండరీలో మొత్తం చక్రం లేదా ఇతర లక్షణాలు ప్రభావితమవుతాయి. ఉదాహరణకు, సెకండరీలో మాసిక రక్తస్రావంలో మార్పులు, లేదా సహవాస సమయంలో నొప్పి వంటివి కనిపిస్తాయి. ఇవి అజ్ఞాత వ్యాధులు లేదా ఫైబ్రాయిడ్స్ వంటి సమస్యలకు సూచనలు. ఈ తేడాలను అర్థం చేసుకోవడం మహిళల ఆరోగ్యానికి కీలకం, ఎందుకంటే త్వరగా గుర్తించడం ద్వారా చికిత్స సులభమవుతుంది. నిపుణులు సెకండరీ డిస్‌మెనోరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే గైనకాలజిస్ట్‌ను సంప్రదించమని సలహా ఇస్తున్నారు. ఇది ఎక్కువ నొప్పి, మార్పులు లేదా ఇతర అసౌకర్యాలతో కూడినప్పుడు మరింత ముఖ్యం. ఉన్నత టెక్నాలజీలతో డయాగ్నోసిస్ చేసి, సరైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి, ఇవి జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయి. మహిళలు తమ శరీర సంకేతాలను గమనించి, ఆరోగ్య చర్చా చేయించుకోవడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చు. ఇలాంటి అవగాహన మహిళల ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తుంది మరియు సమయానికి చికిత్స అవకాశాలను పెంచుతుంది.

# ఆధునిక కాలంలో పిల్లల పెంపకం- సవాళ్లు




ఈ రోజుల్లో పిల్లల్ని పెంచడం అనేది ఒక సూక్ష్మమైన కళాత్మక ప్రక్రియగా మారింది, ఎందుకంటే తల్లిదండ్రులు రెండు తీవ్రమైన మార్గాల మధ్య చిక్కుకుని ఉన్నారు. ఒకవైపు, కొందరు తల్లిదండ్రులు పిల్లలకు అపరిమిత స్వేచ్ఛను అందించడం ద్వారా వారిని సృజనాత్మకంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు, మరోవైపు మరికొందరు కఠినమైన నియమాలతో వారిని అక్షరాలా అనుసరింపజేస్తూ పెంచుతున్నారు. ఈ రెండు విధానాలు భవిష్యత్తులో పిల్లలకు మానసిక, సామాజిక సమస్యలను తీర్చిపెట్టే ప్రమాదం ఉంది. నిపుణులు హెచ్చరిస్తున్నట్లుగా, సమతుల్య ప్రాక్స్ పద్ధతులు అవలంబించకపోతే, పిల్లలు స్వయం నిర్భరత, భావోద్వేగ నిర్వహణలో బలహీనతలు ఎదుర్కొంటారు. అధిక స్వేచ్ఛను అందించే తల్లిదండ్రుల విధానం పిల్లల్లో బాధ్యతాభావాన్ని బలహీనపరుస్తుంది, ఎందుకంటే వారు తమ చర్యలకు పరిణామాలను అర్థం చేసుకోవడానికి అవకాశం లేకుండా పోతారు. ఉదాహరణకు, పిల్లలు తమ కోరికలు తప్పించుకోవడానికి అలవాటు చేసుకుంటే, వారు భవిష్యత్తులో నిరాశలు, క్రమశిక్షణ లేకపోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. ఈ విధానం వారిని స్వార్థపరులుగా మార్చవచ్చు, ఎందుకంటే సామాజిక బాధ్యతలు నేర్చుకోవడానికి ఎటువంటి మార్గదర్శకత్వం లేకుండా పోతుంది. కాబట్టి, స్వేచ్ఛను అందించేటప్పుడు, తల్లిదండ్రులు పరిమితులను స్పష్టంగా నిర్దేశించి, పరిణామాలను వివరించడం ముఖ్యం. అతి క్రమశిక్షణతో పిల్లల్ని పంజరంలో మడుగులా పెంచడం వారి సృజనాత్మకతను, స్వాతంత్ర్య భావాన్ని అణచివేస్తుంది, ఫలితంగా వారు భయం, ఆందోళనలతో కూడిన జీవితాన్ని గడుపుతారు. ఈ పద్ధతి పిల్లల్లో భావోద్వేగ సమస్యలను పెంచి, వారు తప్పుల నుండి నేర్చుకోవడానికి అవకాశం లేకుండా చేస్తుంది. ఉదాహరణకు, కఠిన నియమాలు వల్ల పిల్లలు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించడానికి భయపడతారు, ఇది వారి సామాజిక పరస్పర చర్యలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి, క్రమశిక్షణ అవసరమైనా, అది ప్రోత్సాహకరంగా, వివరణాత్మకంగా ఉండాలి, తప్ప మొదటి స్థాయిలో ఉన్న భావోద్వేగ గాయాలు భవిష్యత్తులో దీర్ఘకాలిక సమస్యలుగా మారతాయి. నిపుణులు సూచించినట్లుగా, పిల్లల పెంపకంలో సమతుల్యత కోసం పరోపకార గుణం, ఆంగర్ మేనేజ్‌మెంట్, గౌరవం, ప్రేమానురాగాలు, బాధ్యత, కార్యదక్షత, తప్పును అంగీకరించడం, సమయపాలన వంటి కీలక నైపుణ్యాలను నేర్పించడం అత్యంత ముఖ్యం. ఈ గుణాలు పిల్లలను మాత్రమే కాక, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తయారు చేస్తాయి. ఉదాహరణకు, ఆంగర్ మేనేజ్‌మెంట్‌ను ద్వారా పిల్లలు భావోద్వేగాలను నిర్వహించుకోవడం నేర్చుకుంటారు, మరియు సమయపాలన ద్వారా వారు కార్యదక్షతను పెంచుకుంటారు. ఈ నైపుణ్యాలను రోజువారీ జీవితంలో అమలు చేస్తూ, తల్లిదండ్రులు పిల్లలకు ఒక బలమైన పునాది వేసి, వారిని భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా మార్చవచ్చు.

## బట్టలు ఉతకడానికి ఎంతసేపు నానబెట్టాలి?



బట్టలు ఉతికేముందు.. ఎంత సేపు నానబెట్టాలి.. ఎప్పుడు ఉతకాలి అనే విషయాలను కూడా తెలుసుకోవడం ముఖ్యం.. వాషింగ్ మెషిన్ ఉన్న వారు డైరెక్ట్ గా అందులో దుస్తులను వేస్తారు.. అయితే.. చేతితో బట్టలు ఉతుకుతుంటే, ఉతకడానికి ముందు వాటిని ఎంతసేపు నానబెట్టాలో మీరు తెలుసుకోవాలి. అసలే శీతాకాలం.. బట్టలు తొందరగా ఆరవు.. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది కావున.. తొందరగా ఆరవు.. ఇదంతా తెలిసిన విషయమే.. బట్టలు ఉతికేముందు.. ఎంత సేపు నానబెట్టాలి.. ఎప్పుడు ఉతకాలి అనే విషయాలను కూడా తెలుసుకోవడం ముఖ్యం.. వాషింగ్ మెషిన్ ఉన్న వారు డైరెక్ట్ గా అందులో దుస్తులను వేస్తారు.. అయితే.. చేతితో బట్టలు ఉతుకుతుంటే, ఉతకడానికి ముందు వాటిని ఎంతసేపు నానబెట్టాలో మీరు తెలుసుకోవాలి. కొన్ని బట్టలు చాలా మృదువుగా ఉంటాయి లేదా ఎక్కువసేపు నానబెట్టినట్లయితే, రంగులు మసకబారుతాయని.. ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. నిజానికి, బట్టలను డిటర్జెంట్ నీటిలో ఎక్కువసేపు నానబెట్టడం పొరపాటుగా పరిగణించబడుతుంది. ఇది బట్టలను శుభ్రం చేసినప్పటికీ, ఇది నష్టాన్ని కూడా కలిగిస్తుంది. బట్టలను ఎక్కువసేపు నానబెట్టడం వల్ల అవి వదులుగా, కుంచించుకుపోయి, లింట్ బయటకు వచ్చి రంగులు మసకబారుతాయి.కొన్నిసార్లు, రాత్రంతా లేదా రోజంతా బట్టలను నానబెట్టడం వల్ల అవి దుర్వాసన వెదజల్లవచ్చు. ఉతికిన తర్వాత కూడా ఈ వాసన అలాగే ఉంటుంది. కాబట్టి, మురికిగా ఉన్న బట్టల రకాన్ని బట్టి మీరు బట్టలను నానబెట్టాలి. అసలు ఎంత సేపు బట్టలు నానబెట్టాలి.. బట్టలు ఉతకడానికి ముందు అరగంట పాటు నీరు - డిటర్జెంట్ కలిపిన ద్రావణంలో నానబెట్టడం సురక్షితమైన పద్ధతి. ఈ సమయం ఫాబ్రిక్ - మురికిని బట్టి ఒక గంట వరకు ఉండవచ్చు. ఉదాహరణకు, పట్టును 30 నిమిషాలు, ఉన్నిని అరగంట పాటు, కాటన్, ఇతర తక్కువ సున్నితమైన బట్టలను ఒక గంట పాటు నానబెట్టవచ్చు. బట్టలను నీటిలో నానబెట్టే ముందు మరకలు, లోతుగా పాతుకుపోయిన మురికిని తొలగించండి. ముందుగా ఆ మరకలను శుభ్రంచేసి ఉతికితే ఫలితం ఉంటుంది.. అలాగే, లేత రంగు బట్టలను ముదురు రంగు బట్టలతో ఎప్పుడూ నానబెట్టకండి. సున్నితమైన మృదువు బట్టలను కఠినమైన బట్టలతో ఎప్పుడూ నానబెట్టకండి.



## దుమ్మురేపుతున్న పెద్దిరెడ్డి సాంగ్.. నాగదుర్గ ఒక్క పాటకు తీసుకునే రెమ్యునరేషన్ ఎంతంటే..

ప్రస్తుతం తెలంగాణ ఫోక్ సాంగ్స్ సోషల్ మీడియాను ఏలేస్తున్నాయి. ఇప్పుడు యూట్యూబ్ లో తెగ ట్రెండ్ అవుతున్న పాటలలో పేరుగల్ల పెద్దిరెడ్డి ఒకటి. ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ నటించిన ఈ పాట ఇప్పుడు నెట్టింట దూసుకుపోతుంది. బుల్లెట్టు బండి ఫేమ్ బండి లక్ష్మణ్ రాసిన ఈ పాట ఇప్పుడు అందరిని ఆకట్టుకుంటుంది. ఓ తండ్రిపై కూతురు చూపించే ప్రేమను నేపథ్యంగా అద్భుతంగా లిరిక్స్ రాశారు బుల్లెట్ బండి ఫేం లక్ష్మణ్. ఇప్పుడు ఈ పాట మిలియన్ వ్యూస్ తో దుమ్మురేపుతంది. ఈపాటను మమత రమేశ్ పాడగా.. మదన్ కే మ్యూజిక్ అందించారు. పచ్చని పోలాల మధ్యలో అందమైన ప్రకృతితో ఈ పాటను మరింత అందంగా తెరకెక్కించారు. ఇందులో నాగదుర్గ లుక్స్, డ్యాన్స్ చూసి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఇదెలా ఉంటే.. ప్రస్తుతం యూట్యూబ్ సెన్సేషన్ నాగదుర్గ గురించి తెలుసుకోవడానికి నెటిజన్స్ తెగ సెర్చ్ చేస్తున్నారు. గతంలో ఓ యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగదుర్గ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కూచిపూడితో తన నృత్య ప్రస్థానం ప్రారంభించి, ఆ తర్వాత జానపద డ్యాన్సర్ గా మారిన నాగదుర్గ ఇప్పుడు హీరోయిన్ గా మారింది. నాగదుర్గ మాట్లాడుతూ%ొ% పాటల ఎంపికలో లిరిక్స్, మ్యూజిక్‌కు ప్రాధాన్యత ఇస్తానని, కుటుంబ సభ్యుల సలహాలు కూడా తీసుకుంటానని వెల్లడించారు. నాలుగు సంవత్సరాల తన ప్రయాణంలో సుమారు 300 పాటలు చేశానని, ప్రతి పాటకు ప్రత్యేకత చూపించడానికి కాస్ట్యూమ్స్, హెయిర్ స్టైల్, డాన్స్‌లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తానని వివరించారు. విమర్శలను పట్టించుకోకుండా, సానుకూల వ్యక్తులతోనే తన సర్కిల్‌ను పరిమితం చేసుకుంటానని నాగదుర్గ తెలిపారు. తాను చేయనన్న కొన్ని పాటలు పెద్ద హిట్ అయ్యాయని, అలాగే తాను చేసిన పాటల విజయానికి ప్రధాన కారణం పాటలోని లిరిక్స్, మ్యూజిక్ అని, తన నృత్యం దానికి అదనపు బలంగా మాత్రమే ఉంటుందని అన్నారు. రెమ్యూనరేషన్ విషయంలో కూడా తన కెరీర్ మొదట్లో తీసుకున్న దానికి ఇప్పుడు తేడా ఉందని, తన బ్రాండ్ వాల్యూ పెరిగిందని అన్నారు. కొత్త ఛానెల్స్ అయినా, పాట నచ్చితే రెమ్యూనరేషన్ తగ్గించుకోవడానికి కూడా సిద్ధంగా ఉంటానని నాగదుర్గ పేర్కొన్నారు. సాయి పల్లవితో పోల్చడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



## ఎన్నాకెన్నాళ్లకు.. ఫైనల్‌గా అయలాన్ తెలుగు రిలీజ్‌పై క్లారిటీ

కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం అయలాన్ ఆర్ రవికుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీ తమిళనాడులో పొంగళ్ కానుకగా జనవరి 12న విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. అయలాన్ తెలుగు వెర్షన్ ను కూడా అదే తేదీన (జనవరి 26న) తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల చేయాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల థియేటర్ల నుంచి తొలగించారు. కాగా తమిళ్ వెర్షన్ ఫిబ్రవరి 9 సన్ నెక్ట్స్‌లోకి వచ్చేసింది. అయితే తెలుగు వెర్షన్ ఎప్పుడు వస్తుందనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్ రాలేదు. అయితే తెలుగులో కూడా మేకర్స్ విడుదలకు ప్లాన్ చేసినప్పటికీ వర్కవుట్ కాలేదు. కానీ మేకర్స్ అప్పటినుంచి థియేటర్ రిలీజ్ అప్‌డేట్ లేదా ఓటీటీ రిలీజ్‌పై కూడా ఎలాంటి వార్త షేర్ చేయలేదు. తీవ్ర నిరాశలో ఉన్న తెలుగు మూవీ లవర్స్ కు ఫైనల్‌గా మేకర్స్ అదిరిపోయే వార్త అందించారు. అయలాన్ డైరెక్టుగా టీవీలో సందడి చేయనుంది. డిసెంబర్ 21న మధ్యాహ్నం 3 గంటలకు ప్రీమియర్ కానుంది. అయితే తెలుగు ఓటీటీ వెర్షన్ రిలీజ్‌కు సంబంధించి మాత్రం ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు మేకర్స్. అయలాన్ 2 కూడా తెరకెక్కించనున్నట్టు కేజేఆర్ స్టూడియోస్, ఫాంటోమ్‌ఎఫ్ఎక్స్ స్టూడియో ఇప్పటికే సంయుక్తంగా ప్రకటన కూడా చేశాయి. సీక్వెల్ కోసం ప్రత్యేకించి రూ.50 కోట్లు కేవలం వీఎఫ్ఎక్స్, సీజీఐ పనుల కోసమే ఖర్చుపెట్టబోతున్నట్టు కూడా ప్రకటించారు మేకర్స్. ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషన్, ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.

## రికార్డుకు చేరువైన అభిషేక్ శర్మ.. 87 పరుగులు చేస్తేనే విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టి!

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఓ క్యాలెండర్ ఇయర్‌లో టీ20లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డుకు చేరువయ్యాడు. ఈ రికార్డు ప్రస్తుతం విరాట్ కోహ్లీ పేరిట ఉన్నది. 2016లో విరాట్ 31 మ్యాచుల్లో 89.66 సగటుతో 1,614 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ ఘనత సాధించడానికి అభిషేక్‌కు ఇప్పుడు కేవలం 87 పరుగులు మాత్రమే అవసరం. ఈ ఏడాది అభిషేక్ ఈ ఏడాదిలో అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ పరుగులు సాధిస్తున్నాడు. అభిషేక్ 39 టీ20 మ్యాచుల్లో 41.43 సగటుతో 1,533 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో మూడు సెంచరీలు, తొమ్మిది అర్ధ సెంచరీలు సాధించాడు. అభిషేక్ ఆదివారం దక్షిణాఫ్రికాతో జరిగే మూడో టీ20 మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఇరు జట్ల మధ్య ఈ మ్యాచ్ ధర్మశాలలో జరగనుంది. దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో అభిషేక్ పెద్దగా రాణించలేకపోయాడు. కటక్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో అభిషేక్ తక్కువ పరుగులకే అవుటయ్యాడు, కానీ బౌలర్ల బలంతో టీమ్ ఇండియా ఆ మ్యాచ్‌లో విజయం సాధించింది. న్యూ చండీగఢ్‌లో జరిగిన రెండో టీ20లో అభిషేక్ ఎనిమిది బంతుల్లో కేవలం 87 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇప్పుడు అభిషేక్ మూడో టీ20లో రాణించాలని కోరుకుంటున్నాడు. దక్షిణాఫ్రికాతో మిగిలిన మూడు



టీ20లలో అభిషేక్ బ్యాట్ రాణిస్తే.. కోహ్లీని వెనక్కి నెట్టి ఒక క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మూడో మ్యాచ్ ఆదివారం ధర్మశాలలో జరగనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉంది. ఇప్పుడు సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని భారత్ కసితో ఉన్నది. తొలి రెండు మ్యాచుల్లో భారత్ అదే ప్లేయింగ్ ఎలెవన్‌తో ఆడింది. అయితే, టీమ్ మేనేజ్‌మెంట్ తుదిజట్టులో ఏమైనా మార్పులు చేస్తుందా? లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# స్పోర్ట్స్

## కేకేఆర్ కీలక నిర్ణయం..! కెప్టెన్‌గా అతడే?



ఐపీఎల్-2026 సీజన్ వేలానికి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాబోయో సీజన్‌లో కూడా తమ జట్టు కెప్టెన్‌గా వెటరన్ ప్లేయర్ అజింక్య రహానేను కొనసాగించాలని కేకేఆర్ యాజమాన్యం నిర్ణయించుకున్నట్లు సమాచారం. డిసెంబర్ 16న దుబాయ్ వేదికగా జరగనున్న మినీ వేలానికి కూడా అతడు హాజరు కానున్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. గత సీజన్‌లో రహానే కెప్టెన్సీలో కేకేఆర్ దారుణ ప్రదర్శన కనబరిచింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన నైట్‌రైడర్స్ ఏ మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. అజింక్య తన కెప్టెన్సీ మార్క్‌ను చూపించలేకపోయాడు. దీంతో ఐపీఎల్-2026లో రహానేను కేకేఆర్ కెప్టెన్సీ నుంచి తప్పిస్తారని వార్తలు వచ్చాయి. కానీ కేకేఆర్ యాజమాన్యం మాత్రం రహానేకు మరో అవకాశమిచ్చేందుకు సిద్ధమైంది. ఇదే విషయంపై టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఈ సీజన్‌లో అజింక్య రహానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించే సూచనలు కన్పిస్తున్నాయి. అదేవిధంగా మరోసారి అతడు కేకేఆర్ జట్టుకు నాయకత్వం వహించే అవకాశముంది. ఎందుకంటే కెప్టెన్సీ సత్తా ఉన్న ఆటగాడు ఎవరూ వేలంలో లేరు. యువ ఆటగాడు రఘువంశీ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. అతడిని వికెట్ కీపర్ బ్యాటర్‌గా ఉపయోగించుకోవాలని కేకేఆర్ భావిస్తుందని బంగర్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

**గ్రీన్‌పై కన్ను..**

కాగా కేకేఆర్ రూ. 64.30 కోట్లు పర్స్‌తో వేలంలోకి వెళ్లనుంది. ఇది అన్ని జట్ల కంటే అత్యధిక మనీ కేకేఆర్ వద్దే ఉంది. నైట్‌రైడర్స్ మొత్తంగా 13 స్థానాలను భర్తీ చేయనుంది. అందులో విదేశీ ఆటగాళ్ల స్థానాలు ఆరు ఉన్నాయి. ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను దక్కించుకునేందుకు కేకేఆర్ ప్రయత్నించే అవకాశముంది. ఈ వేలానికి ముందు కేకేఆర్ రహానే పాటు రింకూ సింగ్, సునీల్ నరైన్, రోవ్‌మన్ పావెల్, వరుణ్ చక్రవర్తి, ఉమ్రాన్ మాలిక్, హర్షిత్ రాణా, అంకుల్ రాయ్, రమన్‌దీప్ సింగ్, అంగ్క్రిష్ రఘువంశీ, మనీష్ పాండే, వైభవ్ అరోరాతో సహా మొత్తం 12 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది.

## నితీశ్ రెడ్డి అట్టర్ ప్లాప్.. అయినా ఆంధ్ర ఘన విజయం

పుణే వేదికగా పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఆంధ్ర ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ సాధించింది. పంజాబ్ బ్యాటర్లలో అన్మోల్‌ప్రీత్ సింగ్(47) టాప్ స్కోరర్‌గా నిలవగా.. సైల్ ఆరోరా(42), రమణ్‌దీప్ సింగ్(43), హర్నూర్ సింగ్(42) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ రాజు, సౌరభ్ కుమార్, పృథ్వీరాజ్ తలా వికెట్ సాధించారు. మధ్యప్రదేశ్‌పై హ్యాట్రిక్‌తో సత్తాచాటిన నితీశ్ రెడ్డి.. ఈ మ్యాచ్‌లో ఒక్క వికెట్‌కే పరిమితమయ్యాడు.

**హేమంత్ రెడ్డి సూపర్ సెంచరీ..**

206 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు కేవలం 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 19.5 ఓవర్లలో చేధించింది. నితీశ్ కుమార్ బ్యాటింగ్‌లో కూడా విఫలమయ్యాడు. రెండు బంతులు ఆడి ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. అతడితో పాటు శ్రీకర్ భరత్(1), అశ్విన్ హెబ్బర్(4), రికీ భుయ్(15) నిరాశపరిచారు. కానీ మర్మరెడ్డి హేమంత్ రెడ్డి సూపర్ సెంచరీతో సత్తాచాటాడు. 53 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లతో 109 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. హేమంత్‌తో పాటు ఎస్డీఎన్వీ ప్రసాద్(35 బంతుల్లో 53 నాటౌట్) మెరుపు హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు. ఆంధ్ర తమ తదుపరి సూపర్ లీగ్ మ్యాచ్‌లో డిసెంబర్ 16న జార?ండ్‌తో తలపడనుంది.



PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.